Email:prajamantalu@gmail.com
www.prajamantalu.com

# ప్రజా మంటలు

సంపుటి : 4 సంచిక : 152
పేజీలు - 8 వెల- రూ 5:00
ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

శుక్రవారం, 08, డిసెంబర్-2023

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri

## ప్రజాభవన్ ముందు బారికేడ్ల తొలగింపు



2లో..



# మేం పాలకులం కాదు సేవకులం..

- ఆరు గ్యారెంటీలపై సిఎం తొలి సంతకం
- ప్రజలకు అండగా ఇందిరమమ రాజ్యస్థాపన
- దవాబ్దకాల నిరంకుశ పాలనకు చరమగీతం
- ప్రగతిభవన్ గడీకి నిర్మించిన ఇనుపకంచె తొలగింపు
- ప్రజలకు అందుబాటులో నేటినుంచి ప్రజాభవన్
- ప్రభుత్వంలో ప్రజలే భాగస్వామని వెల్లడి
- ప్రజల త్యాగాల పునాదుల మీద ఏర్పడిన తెలంగాణ
- ఉద్వేగంగా మాట్లాడిన సిఎం రేవంత్

**హైదరాబాద్,డిసెంబర్7 :** పోరాటాలు, త్యాగాల పునాదులపై తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని.. స్వేచ్ఛ,సామాజిక న్యాయం, సమాన అభివృద్ధి కోసం ఉక్కు సంకల్పంతో సోనియమ్మ తెలంగాణ ఏర్పాటు చేసిందని సిఎం రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. దశాబ్దకాలపు నిరంకుశ పాలనకు ప్రజలు చరమగీతం పాడారని.. ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఎల్బీ స్టేడియం వేదికగా ప్రమాణం చేసిన తరవాత ఆయన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. అమరుల ఆశయ సాధనకు ఇందిరమ్మ రాజ్యం ప్రతిన బూనిందన్నారు. ప్రమాణ స్వీకారం మొదలైనపుడే అక్కడ ప్రగతి భవన్ గడీ ఇనుప కంచెలు బద్దలు కొట్టామని.. రాష్ట్ర ముఖ్యమంత్రిగా మాట ఇస్తున్నా... ప్రభుత్వంలో ప్రజలే భాగస్వాములని ప్రకటించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలపై తొలి సంతకం చేశారు. ప్రమాణ స్వీకారం అయిపోయిన తర్వాత గవర్నర్ తో పాటు కాంగ్రెస్ ముఖ్య నేతలు వెళ్లిపోయిన తర్వాత కృతజ్ఞతా సభ నిర్వహించారు. 'జై సోనియమ్మ' అంటూ సీఎంగా రేవంత్ రెడ్డి తన తొలి ప్రసంగం ప్రారంభించారు. ఎన్నో త్యాగాలతో ఏర్పడిన రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. దశాబ్ద కాలంగా తెలంగాణలో మానవ హక్కులకు భంగం కలిగిందని అన్నారు. ఇందిరమ్మ రాజ్య ఏర్పాటుతో తెలంగాణ నలుమూలలా సమాన అభివృద్ధి జరుగుతుందని స్పష్టం చేశారు. తెలంగాణలో పదేళ్ల బాధలను ప్రజలు మౌనంగా భరించారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రత్యేక రాష్ట్రంలో అమరవీరుల ఆకాంక్షలను నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. రెండో సంతకంగా వికలాంగురాలు రజనీకి ఉద్యోగం కల్పిస్తూ ఉత్తర్వులపై సంతకం చేశారు. తెలంగాణలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రజాభవన్ లో ప్రజా దర్బార్ నిర్వహిస్తామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఈ క్రమంలో ప్రజలందరికీ ఆహ్వానం పలికారు. ప్రజలు ఎప్పుడైనా ప్రజాభవన్‌కు రావొచ్చని, ఈ ప్రభుత్వంలో ప్రజలే భాగస్వాములని స్పష్టం చేశారు. ప్రజాభవన్ వద్ద కంచెలను ఇప్పటికే తొలగించామని అన్నారు. ఇవాళ ప్రగతి భవన్ చుట్టూ కంచెలు బద్దలు కొట్టాం.. రేపు ఉదయం 10 గంటలకు జ్యోతీరావు పూలే ప్రజా భవన్ లో ప్రజా దర్బారు నిర్వహిస్తామన్నారు. మేం పాలకులం కాదు.. మేం సేవకులమని.. మీరు ఇచ్చిన అవకాశాన్ని ఈ ప్రాంత అభివృద్ధికి వినియోగిస్తామని హామీ ఇచ్చారు. కార్యకర్తల కష్టాన్ని, శ్రమను గుర్తు పెట్టుకుంటా.. గుండెల్లో పెట్టుకుంటానని భరోసా ఇచ్చారు. అంతకు ముందు రేవంత్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రిగా

## హామీని నిలబెట్టుకున్న సిఎం రేవంత్

### దివ్యాంగురాలు రజనికి ఉద్యోగ నియామకపత్రం

**హైదరాబాద్,డిసెంబర్7 :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన ప్రమాణాన్ని నిలబెట్టు కున్నారు. ఎన్నికల ముందు గాంధీభవన్ సాక్షిగా ఓ దివ్యాంగురాలు రజనీకి ఇచ్చిన హామీని అమలు చేశారు. ఎల్బీ స్టేడియంలో సీఎంగా బాధ్యతలు చేపట్టగానే లక్షలాది ప్రజల సాక్షిగా రజనీకి ఉద్యోగం ఇస్తూ రేవంత్‌రెడ్డి తన హామీని నెరవేర్చారు. స్టేజీపైనే రజనీకి ఉద్యోగ పత్రాలను అందజేశారు. ముందుగా ఆరు గ్యారెంటీలపై రేవంత్‌రెడ్డి తొలి సంతకం చేయగా... అనంతరం రజనీకి ప్రభుత్వోద్యోగం ఇస్తూ రెండో సంతకం చేశారు. నాంపల్లి నియోజకవర్గం బోయిగూడ కమాన్ ప్రాంతానికి చెందిన రజినీ అక్టోబరు 17న గాంధీభవన్‌లో రేవంత్‌రెడ్డిని కలిశారు. దివ్యాంగురాలిని కావడంతో తనకు ఉద్యోగం లభించడం లేదని, ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నానని, ఉద్యోగం ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. రజినీ, ఆమె కుటుంబసభ్యుల వివరాలు అడిగి తెలుసుకున్న రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ 6 గ్యారెంటీల కార్డును సంతకం చేసి ఇచ్చారు. తాను సీఎం అయ్యాక తొలి ఉద్యోగం రజనీకే ఇస్తానని హామీ ఇచ్చారు. మొత్తానికి రేవంత్ ఇచ్చిన హామీను అక్షరాల నిజం చేసి చూపించారు.

# తెలంగాణలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వం

- ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణం
- సిఎం తరవాత డిప్యూటీ సిఎంగా భట్టి ప్రమాణం
- తరవాత మంత్రులతో ప్రమాణం
- ప్రమాణస్వీకారం చేయించిన గవర్నర్ తమిళసై
- ఎల్బీ స్టేడియం వేదికగా కార్యక్రమం
- భారీగా తరలివచ్చిన ప్రజలు,నాయకులు






**హైదరాబాద్,డిసెంబర్7 :** తెలంగాణలో కొత్త ప్రభుత్వం కొలువుతీరింది. మొన్నటి ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడింది. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. ఆయనతోపాటు 11మంది మంత్రులు ప్రమాణం చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్ రెడ్డి చేత గవర్నర్ తమిళసై ప్రమాణ స్వీకారం చేయించారు. ఎల్బీ స్టేడియంలో ఘనంగా జరిగిన కార్యక్రమంలో గవర్నర్ తమిళిశై సౌందర రాజన్ సిఎంతో పాటు మంత్రులతో ప్రమాణం చేయించారు. తొలుత సిఎంగా రేవంత్ రెడ్డి ప్రమాణం చేశారు. తెలుగులో దైవసాక్షిగా ఆయన ప్రమాణం చేశారు. రేవంత్ అనే నేను అని .. పలకగానే స్టేడియం హోరెత్తిపోయింది. రేవంత్‌తో పాటు పదకొండు మంది మంత్రులు ప్రమాణం చేశారు. రేవంత్ రెడ్డి తర్వాత మల్లు భట్టి విక్రమార్క ఉప ముఖ్యమంత్రిగా

## ప్రజాదర్బార్‌తో ప్రజలకు చేరువ

- ప్రజల ఆకాంక్షలకు అనగుణంగా పాలన: మల్లు రవి

**హైదరాబాద్,డిసెంబర్7 :** ప్రజా దర్బార్‌తో ప్రజలకు దగ్గరవుతామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మా నిర్ణయాలు చూసి కేసీఆర్‌కు దిమ్మ తిరుగుద్దని అన్నారు. రాష్ట్రంలో నియంత పాలనను అంతమొందించాం. ప్రజా పాలన మొదలు కాబోతోంది. పాలనను గాడిన పెడతాం. ప్రజలు సమస్య చెప్పుకోవడానికి మొన్నటి వరకు అవకాశమే లేదు. ప్రజలందరూ ఎప్పుడైనా ప్రజాభవన్‌కు రావచ్చు. కేసీఆర్ అహంకారం పూర్తిగా దించేస్తాం. చేసిన పొరపాట్లకు కేసీఆర్ పశ్చాత్తాపం చెందాలని సూచించారు.ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణలో పాలన సాగుతుందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు మల్లు రవి వ్యాఖ్యానించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తో పాటు 11 మంది మంత్రులు ప్రమాణ స్వీకా ర చేసిన విషయం తెలిసిందే. అయితే ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్ర మార్క, మంత్రులకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## ప్రజానాడి





## సిఎం రేవంత్‌కు ప్రధాని మోడీ అభినందనలు

### హరీష్ రావు, చిరంజీవులు సైతం అభినందన



**హైదరాబాద్,డిసెంబర్7 :** సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన రేవంత్ రెడ్డికి అభినందనలు వెల్లువెత్తాయి. ప్రధానమంత్రి మోదీ తదితరులు అభినందన సందేశాలు అందించారు. ఈ మేరకు ఎక్స్ (ట్విట్టర్) ద్వారా ప్రధాని మోడీ విషస్ చెప్పారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన శ్రీ రేవంత్ రెడ్డి గారికి అభినందనలు. రాష్ట్ర ప్రగతికి, పౌరుల సంక్షేమానికి అన్ని విధాలా తోడ్పాటు అందిస్తానని నేను హామీ ఇస్తున్నాను అంటూ కామెంట్ చేశారు. ఇంగ్లీష్, తెలుగు భాషల్లో నరేంద్ర మోదీ ఎక్స్ నుంచి ఈ పోస్టులు వచ్చాయి. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన విషయం తెలిసిందే. తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రిగా రేవంత్ ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే.. ఈ విధంగా అభినందనలు తెలియజేశారు. ప్రధాని మోదీతో పాటు మాజీమంత్రి హరీష్ రావు, మెగాస్టార్ చిరంజీవి తెలంగాణ కొత్త ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన రేవంత్ రెడ్డికి, డిప్యూటీ సీఎంగా ప్రమాణం చేసిన మల్లు భట్టి విక్రమార్కకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలుపుతూ ట్వీట్ చేశారు. సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# స్పీకర్‌గా గడ్డం ప్రసాద్ కుమార్

- దళితుడికి అత్యున్నత స్థానం
- కేబినేట్‌లో ఇద్దరు దళితులకు చోటు
- ఇద్దరు మహిళలకు స్థానం
- సామాజిక సమతుల్యతను పాటించిన రేవంత్



**హైదరాబాద్,డిసెంబర్7 :** తెలంగాణ శాసనసభ కొత్త స్పీకర్‌గా గడ్డం ప్రసాద్ కుమార్ నియమితు లయ్యారు. కాంగ్రెస్ పార్టీ ఆయనను ఎంపిక చేసింది. ఇటీవలి ఎన్నికల్లో వికారాబాద్ నుంచి గెలుపొందిన గడ్డం ప్రసాద్ కుమార్ గతంలో మంత్రిగా పనిచేసిన అనుభవం ఉంది. ఇద్దరు ముఖ్యమంత్రులతో కేబినేట్ లో పని చేసిన అనుభవం.. అణగారిన వర్గాల నుంచి వచ్చిన వ్యక్తి.. ఇవి తెలంగాణ కొత్త స్పీకర్‌గా ఎన్నికైన గడ్డం ప్రసాద్ విశేషాలు. దళిత సామాజిక వర్గానికి చెందిన ఈయన రంగారెడ్డి జిల్లా మర్పల్లిలో జన్మించారు. ఇంటర్ చదివారు. 2008 ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా వికారాబాద్ నియోజకవర్గం నుంచి గెలిచారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి కేబినెట్‌లో ఆయన మంత్రిగా పనిచేశారు. 2012లో అప్పటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి కేబినెట్‌లో మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అయితే 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన వరుస ఓటములను చవిచూశారు.

## ప్రజాభవన్ ముందు బారికేడ్ల తొలగింపు



### తొలగిన నగర ట్రాఫిక్ చిక్కులు

**హైదరాబాద్,డిసెంబర్7 :** బేగంపేటలో ట్రాఫిక్ చిక్కుగా మారిన సిఎం అధికారిక నివాసం ప్రగతి భవన్ ముందున్న బారికేడ్లు తొలగించారు. సిఎంగ ఆరేవంత్ రెడ్డి ప్రమాణానికి ముందే మౌఖింగా ఇచ్చిన ఆదేశాలతో అక్కడ ప్రజలకు ఇబ్బందిగా మారిన కంచెను తొలగించారు. ప్రగతి భవన్‌ను 'ప్రజాభవన్'గా మార్చుతానని, సామాన్య జనాలకు సైతం ప్రవేశం ఉంటుందని తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో విజయం అనంతరం తొలి మీడియా సమావేశంలోనే టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. చెప్పినట్టుగానే అడుగులు పడ్డాయి. ప్రగతి భవన్ వద్ద ట్రాఫిక్ ఆంక్షలను అధికారులు ఎత్తివేశారు. భవనం ముందున్న బ్యారికేడ్లను తొలగించారు. జేసీబీ సాయంతో పనులు చేపట్టారు. గురువారమే బ్యారికెడ్స్ తొలగింపు పనులు పూర్తి కానున్నాయని అధికారులు తెలిపారు. దీంతో పంజాగుట్ట, సోమాజిగూడ నుంచి వచ్చే ట్రాఫిక్కు చిక్కులు తొలగనున్నాయి. దీంతో అమీర్ పేట, బేగంపేట మధ్య ట్రాఫిక్ చిక్కులు తొలగనున్నాయి. గత ప్రభుత్వం ఇనుప కంచె కారణంగా ఈ ప్రాంతంలో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. ప్రగతిభవన్ ఛాయలకు ఎవరు కూడా రాకుండా ఇలా చేశారు.

## ప్రజలు మార్పును కోరుకున్నారు

**అయినా బిఆర్ఎస్ ఎక్కడా వెనకంజవేయదు**

**త్వరలోనే మళ్లీ కెసిఆర్ పంజావిప్పతారు**

**మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి**



**నిజామాబాద్,డిసెంబర్7 :** రాష్ట్రంలో ప్రజలు మార్పును కోరుకున్నారని మాజీమంత్రి వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. కెసిఆర్‌కు ఇది తాత్కాలిక విరామం మాత్రమేనని అన్నారు. కొత్త ప్రభుత్వం మంచి పనులు చేస్తే తాము సహకరిస్తామని, అయితే వారు తమ హామీలను నెరవేర్చకపోతే పోరాటాలు చేస్తామన్నారు. బిఆర్ఎస్ ఓడి పోయినందుకు కార్యకర్తలు అధైర్య పడవద్దని.. అందరికీ అండగా ఉంటామని.. ప్రతీ నిమిషం మీ వెంటే ఉంటూ సమస్యలపై పోరాడుతామని ఎమ్మెల్యే కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ఈ ఎన్నికల్లో పార్టీ నాయకుల, కార్యకర్తలు కష్టపడి పనిచేశారని ఆయన అభినందించారు. తనను గెలిపించిన వారికి కృతజ్ఞతు తెలుపుతూనే...పార్టీ ఓటమికి నాయకులు, కార్యకర్తలు ఎంతమాత్రం కారణం కాదని అన్నారు. ఎక్కడా నాయకులపై నిందలు మోపవద్దన్నారు. మార్పును ఆహ్వానిద్దామని, కొంతకాలం వేచిచూద్దామని అన్నారు. తెలంగాణ ఉద్యమం నడిపిన తమకు అధికారం ప్రధానం కాదని, అవసరమైతే తెలంగాణ కోసం మరొక ఉద్యమం నడుపుతామని స్పష్టం చేశారు. పదేండ్ల పాటు ప్రజలు తనకు ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చారని, మరోమారు మళ్లీ అవకాశం ఇచ్చారని అన్నారు. ఇందుకు నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. కాంగ్రెస్‌ది నిజమైన గెలుపు కాదని, తక్కువ ఓట్ల తేడాతోనే చాలామంది ఓడిపోయామన్నారు. అయితే ప్రజల తీర్పును గౌరవించే సంస్కారం మనదన్నారు. వాళ్లలో వాళ్లే కొట్టుకోవడంతో ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతకాలం ఉంటుందో చెప్పలేమని అన్నారు. కాంగ్రెసోళ్లకు పదవులే ప్రధానమని, ప్రజల సమస్యలు వారికి పట్టవని విమర్శించారు. తెలంగాణకు శ్రీరామరక్షగా నిలిచిన కేసీఆర్ త్వరలోనే మళ్లీ సీఎంగా వస్తారని చెప్పారు. పదేండ్లుగా నియోజకవర్గం అభివృద్ధికి, సంక్షేమానికి ఎంతో కృషిచేశానని అన్నారు.

ఢిల్లీలో బిజెపి పార్లమెంటరీ సమావేశం

## మోడీకి ఘనంగా స్వాగతం పలికిన ఎంపిలు

**న్యూఢిల్లీ,డిసెంబర్7 :** బీజేపీ పార్లమెంటరీ సమావేవానికి హాజరైన మోడీకి ఎంపిలు ఘనంగా స్వాగతం పలికారు. ఆయన సమావేశ మందిరానికి రాగానే పార్టీ ఎంపీలు 'మోదీ జీ కా స్వాగ్ హై' అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా పూలమాలతో స్వాగతం పలికారు. దేశ వ్యాప్తంగా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 3 రాష్టాల్లో బీజేపీ అధికారం కైవసం చేసుకుంది. ఈ ఉత్సాహంతో గురువారం ఢిల్లీలో బీజేపీ పార్లమెంటరీ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. సమావేశానికి ప్రధాని మోదీ హాజరయ్యారు. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ లలో ముఖ్యమంత్రుల ఎంపికపై ఉత్కంఠ నెలకొన్న నేపథ్యంలో ప్రస్తుత పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో బీజేపీ తొలిసారిగా సమావేశం నిర్వహించింది. సభ 4వ రోజు ప్రారంభానికి ముందు పార్లమెంట్ హౌస్ కాంప్లెక్స్‌లోని బాలయోగి ఆడిటోరియంలో ఈ సమావేశం జరిగింది. రాబోయే 5 ఏళ్లలో ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ని ఢీ కొట్టే సమర్ధవంతమైన నేతని ముఖ్యమంత్రిగా ఆమోదించడం బీజేపీ ముందున్న కీలకమైన పని. 2024 లోక్ సభ ఎన్నికలకు సమాయత్తమవుతన్న కాంగ్రెస్ పార్టీకి 3 రాష్ట్రాల్లో ప్రతికూల ఫలితాలు రావడం కాస్తంత నిరాశకలిగించింది. తెలంగాణలో అధికార బీఆర్ఎస్ ను ఓడించి కాంగ్రెస్ అధికారం చేపట్టింది.

## సచివాలయంలో సిఎం రేవంత్ పూజలు

### ఘనంగా స్వాగతం పలికిన అధికారులు



**హైదరాబాద్,డిసెంబర్7 :** తెలంగాణ ముఖ్యమంత్రి హోదాలో రాష్ట్ర సచివాలయానికి చేరుకున్న సిఎం రేవంత్ రెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. ప్రోటోకాల్ ప్రకారం కాన్వాయ్‌లో సెక్రటేరియట్‌కు వచ్చిన రేవంత్ కు సీఎస్ శాంతి కుమారి, డీజీపీ గుప్తా సహా పలువురు ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. అదే సమయంలో పోలీసులు రేవంత్ రెడ్డికి గౌరవ వందనం సమర్పించారు. లోనికి వెళ్లిన సీఎస్, డీజీపీతో సెక్రటేరియట్ లోనికి వెళ్లిన రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రి ఛాంబర్ ఉన్న ఆరో అంతస్తుకు వెళ్లే ముందు పండితులు ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. చాంబర్‌లోభార్యతో కలసి పూజలు నిర్వహించారు. వేదపండితుల ఆశీర్వచనం మధ్య తన సీటులో ఆసీనులయ్యారు. ఆ తర్వాత కొత్తగా ప్రమాణ స్వీకారం చేసిన 11 మంది మంత్రులు కూడా చేరుకున్నారు. మంత్రులుగా మల్లు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు వరుసగా ప్రమాణం చేశారు. వీరిలో డిప్యూటీ సీఎంగా మల్లు భట్టి విక్రమార్క ప్రమాణ స్వీకారం చేశారు. వీరందరితో కాసేపట్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరగనుంది.

# ముళ్లబాటలో సీతక్క ప్రయాణం

- ముళ్లబాటలో సీతక్క ప్రయాణం
- నక్సలైట్ నుంచి మంత్రిగా పయనం
- రాజకీయాల్లో ఎన్నో కష్టాలతో ప్రజాసేవ
- ప్రజాసేవలో ఆమను మించిన వారు లేరేమో



**ములుగు,డిసెంబర్7 :** ధనసరి అనసూయ అలియాస్ సీతక్క గురించి తెలియని వారు ఉండరు. ఆదివాసీ కోయ జాతికి చెందిన ఈమె తెలుగు రాష్ట్రాల ప్రజలకు సుపరిచితమే. ఆమె జీవితం ఎందరికో ఆదర్శప్రాయం. తెలంగాణ రాజకీయాల్లో సీతక్కది ప్రత్యేక స్థానం. విద్యార్థి దశ నుంచే పోరాటం మొదలు పెట్టారు. ఆ తర్వాత దళంలో చేరి అన్నలతో కలిసి ప్రభుత్వం మీద పోరాటం చేశారు. అక్కడ మారిన సిద్ధాంతాలు పొసగక బయటికి వచ్చారు. సాయుధ పోరాటాల కంటే ప్రజల్లో ఉండి పోరాడటమే మేలనుకుని జనజీవన స్రవంతిలో కలిసిపో యారు. రాజకీయాల్లో చేరడానికి ముందు 15ఏళ్లకుపైగా మావోయిస్టుగా అజ్ఞాతవాసం గడిపిన మాజీ నక్సలైటు సీతక్క.. ఇప్పుడు తెలంగాణ మంత్రివర్గంలో చోటుదక్కించుకు న్నారు. రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. నక్సలైట్ జీవితం నుంచి లాయర్‌గా.. ఆపై ఎమ్మెల్యేగా... ఆ తర్వాత ప్రజాదరణ పొం దిన నాయకురాలిగా గుర్తింపుతెచ్చుకున్న సీతక్క ఇప్పుడు.. కేబినెట్ మంత్రి స్థాయికి ఎదిగిరారు. ముళ్ల బాటలను దాటుకుండా.. ప్రజాసేవకు సరైన మార్గం ఎన్నుకుంటూ... ఉన్నత స్థాయికి చేరుకున్నారు. తుపాకీ తూట కంటే అంబేద్కర్ బాటలో పయనిస్తే ప్రజల బతుకుల్లో మార్పు తీసుకురావచ్చని భావించారు. గిరిజన మహిళలకు ఉపాధినిచ్చే ప్రభుత్వ సంస్థలో చేరి ఉద్యోగం చేసుకుంటూ సామాజికసేవ వైపు పయనం సాగించారు సీతక్క. ఆపై రాజకీయాల్లోకి వచ్చారు. పాలిటిక్స్‌లో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నారు. తెలుగుదేశంలో చేరి ములుగు నుంచి ఎమ్మెల్యేగా గెలిచి.. సొంత నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వచ్చారు. ప్రజల పక్షాన పోరాడారు. ఇటు రాజకీయాల్లో, అటు ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఇలా నక్సలైట్ జీవితం నుంచి.. ఇప్పుడు మంత్రిగా ఎదిగారు సీతక్క. ములుగు నియోజకవర్గంలో ఆమె ప్రజలకు ఎంతగా చేరువయ్యారో ఆమె చేసిన సేవలే నిదర్శనం. కరోనా కష్టకాలంలో ఆమె గిరిజనులకు అండగా నిలిచారు. 1971, జూలై 9న.. వరంగల్ జిల్లా ములుగు మండలం జగ్గన్నగూడెంకి చెందిన సమ్మక్క-సమ్మయ్య దంపతులకు జన్మించారు సీతక్క. ప్రభుత్వ గిరిజన వసతి గృహంలో చదువుకుంటున్న సమయంలోనే పోరాటంలోకి వెళ్లారు సీతక్క. గిరిజన వసతి గృహంలో సరిగా భోజనం పెట్టడం లేదని, బాలికలకు ప్రభుత్వం ఇస్తున్న పది రూపాయలను వసతి గృహ అధికారులు ఇవ్వడం లేదని తోటి విద్యార్థులను కూడగట్టుకుని ధర్నా చేశారు.. అప్పుడు ఆమె వయస్సు 13ఏళ్లు. ఆమె పోరాటపటిమను గుర్తించిన పీపుల్స్ వార్ దళం సభ్యుల పిలుపుతో...14ఏళ్ల వయస్సులోనే అడవిబాట పట్టారు. 1988లో 10వ తరగతి చదువుతుండగానే నక్సల్స్ పార్టీలో చేరారు. మావోయిస్టుల్లో చేరినా చదువు వదల్లేదు సతీక్క. పోలీసుల అరెస్ట్ చేసినా... జైల్లో ఉంటూనే పదో తరగతిలో ఫెయిల్ అయిన స్జబెక్టులకు పరీక్షల రాసి పాస్ అయ్యారు. ఆ తర్వాత... ప్రేమించిన తన బావనే పెళ్లాడారు సీతక్క. రెండు నెలల కుమారుడిని వేరేవాళ్ల చేతుల్లో పెట్టి మళ్లీ అడవిబాట పట్టారు. జన నాట్య మండలి ద్వారా ఆదివాసీల సమస్యలపై పోరాటం చేశారు. 20ఏళ్ల పాటు నక్సలైట్‌గా వివిధ హోదాల్లో పనిచేశారు సీతక్క. ఆ తర్వాత సీతక్క దంపతుల మధ్య విబేధాలు రావడం.. దళంలో మారిన సిద్ధాంతాలు నచ్చక 1996లో బయటికి వచ్చేశారు సీతక్క. ఆ తరువాత ఐటిడీఏలో నెల జీతానికి పనిచేస్తూ చదువు కొనసాగించారు. ఎన్టీఆర్ పిలుపుతో జనజీవన స్రవంతిలోకి వచ్చిన సీతక్క.. 2001లో లాయర్‌గా ప్రాక్టీస్ చేశారు. 2004లో ములుగు నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. 2009లో తొలిసారిగా ములుగు నుంచి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. ఆ తర్వాత 2014 ఎన్నికల్లో మళ్లీ ఓటమి చవిచూశారు. ఆ తర్వాత 2017లో టీడీపీ నుంచి కాంగ్రెస్ చేరారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా మరోసారి ములుగు నుంచి గెలుపొందారు సీతక్క. కరోనా సమయంలో అందరూ ఇళ్ళకే పరిమితమైతే.. ప్రభుత్వ సహాయం లేకున్నా తన నియోజకవర్గంలోని గ్రామాలన్నీ తిరుగుతూ ఎంతో మందికి ఆహారం, నిత్యావసర వస్తువులను అందజేశారు. ప్రజా నాయకురాలిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాలోని గోత్తి కోయ గిరిజనుల జీవన స్థితిగతులపై పరిశోధనలు చేసి డాక్టరేట్ కూడా పొందారు.

# కొత్తమంత్రులంతా పాతవారే

**కొత్తమంత్రులంతా పాతవారే**

**వివిధ రంగాల్లో వారంతా నిష్ణాతులే..**

**మంత్రుల జీవిత విశేషాలు**



హైదరాబాద్,డిసెంబర్7 : తెలంగాణలో కొత్త కేబినెట్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కొలువుదీరింది. మంత్రివర్గంలో 11 మందికి చోటు కల్పించారు. పార్టీలో సుదీర్ఘకాలంగా పని చేస్తున్న నేతలకు ప్రాధాన్యత ఇచ్చారు. మల్లు భట్టి విక్రమార్క, మంథని ఎమ్మెల్యే శ్రీధర్ బాబు, హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్ గౌడ్, నల్గొండ నుంచి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, వరంగల్ నుంచి కొండా సురేఖతో,సీతక్కలకు స్థానం దక్కింది. ఖమ్మం నుంచి తుమ్మల, పొంగులేటిలకు స్థానందక్కింది. ఇక వారి వివరాలు పరిశీలిస్తే ఇలా ఉన్నాయి. డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క మధిర నియోజకవర్గంలో నుంచి నాల్గోసారి విజయం సాధించారు. ఖమ్మం జిల్లాలోని వైరా మండలంలోని స్నానాల లక్ష్మీపురం మల్లు భట్టి విక్రమార్క స్వగ్రామం. హైదరాబాద్‌లోని నిజాం కళాశాల నుంచి గ్రాడ్యుయేషన్, హైదరాబాద్ విశ్వవిద్యాలయం నుంచి పీజీ పూర్తి చేశారు. 2009లో తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2009లో చీఫ్ విప్‌గా పని చేశారు. అంతకు ముందు ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2011న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా పని చేశారు. 2014లో మధిర నియోజకవర్గం నుంచి రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2018లో మధిర నుంచే మూడోసారి గెలుపొందారు. 2019 నుంచి సిఎల్పి లీడర్‌గా ఉన్నారు. దుద్దిళ్ల శ్రీధర్ బాబు మంథని నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. మాజీ స్పీకర్ దుద్దిళ్ళ శ్రీపాద రావు, జయమ్మ దంపతులకు 1969 మే 30న జన్మించారు. ఐఏఎస్ అధికారి శైలజ రామయ్యర్‌తో వివాహం జరిగింది. మంథని నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఉమ్మడి ఏపీలో పౌర సరఫరాలు, శాసన వ్యవహారాల మంత్రిగా పని చేశారు. ఢిల్లీ విశ్వవిద్యాలయంలో న్యాయ విద్యను అభ్యసించారు. 1998లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో న్యాయవాదిగా కూడా పేరు నమోదు చేసుకున్నారు. తండ్రి శ్రీపాదరావు హత్యతో 1999లో రాజకీయాల్లో వచ్చారు శ్రీధర్‌బాబు. 1999 శాసనసభ ఎన్నికల్లో మంథని నుంచి మొదటి సారిగా గెలుపొందారు. 2004, 2018, 2023 మంథని నుంచి విజయం సాధించారు. 2004-2019 వరకు ప్రభుత్వ చీఫ్ విప్ కూడ ఉన్నారు. 2010-2014 వరకు కిరణ్‌కుమార్ రెడ్డి కేబినెట్‌లో శాసనసభ వ్యవహారాల మంత్రిగా, 2009-10 వరకు ఉన్నత విద్య, ఎన్నారై వ్యవహారాల మంత్రిగా విధులు నిర్వహించారు. 2014లో మేనిఫెస్టో కమిటీ ఛైర్మన్ గా ఉన్నారు. ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో కేరీర్‌ను ప్రారంభించిన ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి రాజకీయాల్లోనూ కెప్టెన్‌గా ఉన్నారు. ఈసారి కూడా హుజుర్‌నగర్ నియోజకవర్గం నుంచి విజయం సాధించి మంత్రిగా ప్రమాణం చేయనున్నారు. బీఎస్సీలో గ్రాడ్యుయేషన్ చేసిన ఉత్తమ్ కుమార్ రెడ్డి 1982 నుంచి 1991 వరకు ఐఏఎఫ్‌లో పని చేశారు. 1999, 2004లో కోదాడ నుంచి ఎమ్మెల్యే గెలుపొందారు. 2009, 2014, 2018, 2023లో హుజుర్‌నగర్ నుంచి విజయం సాధించారు. 2019లో హుజుర్ నగర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి 2019లో నల్గొండ ఎంపీగా గెలిచారు. 2015- 2021 వరకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా కూడా ఉన్నారు. కిరణ్ కుమార్ రెడ్డి కేబినెట్‌లో గృహనిర్మాణ శాఖ మంత్రిగా పని చేశారు. మిగ్ 21, మిగ్ 23ను ఫ్రంట్ లైన్గ÷టైర్ స్క్వాడ్రన్ గా ఉన్నారు. రాష్ట్రపతి భవన్‌లో భద్రత , ప్రోటోకాల్, పరిపాలన, రాష్ట్రపతి విదేశీ పర్యటనల కంట్రోలర్‌గా కూడా పని చేశారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ నుంచి ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. పొన్నం ప్రభాకర్ గౌడ్ 1967 మే 8న జన్మించారు. తల్లిదండ్రుల పేర్లు సత్తయ్య - మల్లమ్మ. 2000 ఏప్రిల్ 21న మంజులతో వివాహం జరిగింది. ఉస్మానియా యూనివర్సిటీలో బిఏ, ఎల్ఎల్‌బి పూర్తి చేశారు. 2009లో కరీంనగర్ పార్లమెంట్ నుంచి తొలిసారిగా పోటీ చేసి విజయం సాధించారు. అత్యంత పిన్న వయస్సులో ఎంపీగా ఎన్నికైన నేతగా పొన్నం పేరు మీద రికార్డు ఉంది. విద్యార్థి ఉద్యమకారుడిగా రాజకీయ ప్రయాణం ప్రారంభించారు. 2022 డిసెంబర్ 10న తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడుగా కూడా ఉన్నారు. 2023లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్ కమిటీ చైర్మన్ గా ఉన్నారు. 2014, 2019 ఎన్నికల్లో కరీంనగర్ ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కరీంనగర్ అసెంబ్లీ నుంచి ఓటమి పాలయ్యారు. 2023 తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి విజయం సాధించి ఇప్పుడు మంత్రి అవుతున్నారు. కొండా సురేఖ తెలంగాణ రాజకీయాల్లో ఫైర్ బ్రాండ్‌గా పేరు తెచ్చుకున్న నేత.1965 ఆగస్ట్ 19న జన్మించారు. 1995లో మండల పరిషత్‌కు ఎన్నికల్లో విజయం సాధించి సంచలనంగా మారారు. 1996లో పీసీసీ సభ్యురాలుగా పని చేశారు. 1999లో శాయంపేట నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2000లో ఏఐసీసీ సభ్యురాలిగా నియమితులయ్యారు. 2004లో శాయంపేట నుంచి రెండో సారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2009లో పరకాల నుంచి అసెంబ్లీకి మూడోసారి ఎన్నికయ్యారు. 2009లో వైఎస్ కేబినెట్‌లో మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రిగా పని చేశారు. 2011లో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన సురేఖ జగన్ వెంట నడిచారు. 2013లో వైసీపీకి రాజీనామా చేశారు. 2014 ఎన్నికల్లో వరంగల్ తూర్పు నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా నాలుగోసారి విజయం సాధించారు. 2018లో బీఆర్ఎస్‌కు రాజీనామా, కాంగ్రెస్‌లో చేరారు. 2023లో వరంగల్ తూర్పు నుంచి ఎమ్మెల్యేగా ఐదోసారి గెలుపొందారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కాంగ్రెస్‌లో కీలకమైన నేతల్లో ఒకరు. 1963 మే 23న జన్మించిన ఈయన ఎన్ఎస్‌యూఐ ద్వారా రాజకీయాల్లోకి వచ్చారు. 1999, 2004, 2009, 2014 ఎన్నికల్లో విజయం సాధించారు. నల్గొండ స్థానం నుంచి వరుసగా 3 సార్లు విజయం సాధించిన తొలి సభ్యుడయ్యారు. ఎస్, రోశయ్య మంత్రివర్గాల?లో ఐటీ, యువజన సర్వీసులు, క్రీడల మంత్రిగా కూడా పని చేశారు. కిరణ్ కుమార్ రెడ్డి మంత్రివర్గంలో మౌలిక వసతులు, పెట్టుబడులు శాఖల మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో 2011 అక్టోబరు 5న మంత్రి పదవికి రాజీనామా చేశారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో భువనగిరి నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున ఎంపీగా గెలుపొందారు. బీఆర్ఎస్ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ పై 4500 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. 2022 ఏప్రిల్ 10న శాసనసభ ఎన్నికల స్టార్ క్యాంపెనర్‌గా నియమితు లయ్యారు. 2023 సెప్టెంబర్ 20న కాంగ్రెస్ ఎన్నికల స్క్రీనింగ్ కమిటీలో స్థానం దక్కించుకున్నారు. ధనసరి అనసూయ అంటే తెలియకపో వచ్చేమో కానీ సీతక్క అంటే తెలియని వారు ఉండరు. తెలుగు రాజకీయాల్లో సీతక్క ఓ సంచలనంగా చెప్పవచ్చు. 15 ఏళ్లకుపైగా మావోయిస్టుగా అజ్ఞాతంలో ఉంటూ పోరాటాలు చేశారు. తర్వాత జనజీవన స్రవంతిలో కలిసిపోయి రాజకీయ జీవితం ప్రారంభించారు. ములుగు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధిస్తూ వస్తున్నారు. నాలుగు సార్లు పోటీ చేస్తే మూడుసార్లు విజయం సాధించారు. మొదట్లో సీతక్క జననాట్య మండలి ద్వారా గ్రామాల్లో తిరుగుతూ ప్రజలను చైతన్యవంతులను చేసేవాళ్లు. జరుగుతున్న అన్యాయంపై నాటకాల ద్వార ప్రజలకు తెలియ జెప్పేవారు. అప్పటి భూస్వాముల ఆగడాలను ఎదుర్కోవడానికి సాయుధ ప్రతిఘటన తప్ప మరొక మార్గం లేదని భావించి నక్సల్స్‌లో చేరారు. సీతక్క 1988లో నక్సల్‌లో చేరినప్పుడు సీతక్కా 10 వ తరగతి చదువుతున్న విద్యార్థి. ఫూలన్ దేవి రచనల నుంచి ప్రేరణ పొంది, ఆర్థిక దోపిడీ కులవాద వివక్షపై కోపంతో నక్సల్స్‌లో చేరారు. జనశక్తి (సీపీఐ) (ఎంఎల్) పార్టీలో చేరి పోరాటం చేశారు. చాలా సంవత్సరాలు అజ్ఞాత జీవితం గడిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో జనశక్తి సాయుధ పోరాటంలో మహిళా నక్సలైట్‌గా, దళం లీడర్‌గా ప్రధాన భూమిక వహించారు. ఎన్టీఆర్ పిలుపు మేరకు మావోయిస్టులు జన జీవన స్రవంతిలో కలిసిపోయారు. 2001లో హైదరాబాద్లో న్యాయవాదిగా మారడానికి ఎల్.ఎల్.బి చదివారు. చట్టం అధ్యయనం చేసిన తర్వాతే ఆమెకు ప్రజా విధానం, పాలనపై ఆసక్తి ఏర్పడింది. స్థానికంగా మంచి పేరు ఉన్నందున చంద్రబాబు ఆమెకు టికెట్ ఇచ్చారు. దీంతో సీతక్క రాజకీయ రంగప్రవేశం చేసి తెలుగుదేశం పార్టీలో చేరారు. 2004లో జరిగిన సాధారణ ఎన్నికల్లో ములుగు నియోజకవర్గం నుంచి టీడీపీ తరపున పోటీ చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి పొదెం వీరయ్య చేతిలో ఓటమి పాలయ్యారు. 2009 ఎన్నికల్లో మహాకూటమి అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ తరపు నుంచి పోటీ చేసి వీరయ్యపై గెలిచారు. 2014లోమూడోసారి టీడీపీ అభ్యర్థినిగా బరిలో నిలిచి అజ్మీరా చందూలాల్ చేతిలో ఓడిపోయారు. తర్వాత టీడీపీకి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2018, 2023లో కాంగ్రెస్ పార్టీ నుంచి విజయం సాధించారు. తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం నియోజకవర్గం నుంచి విజయం సాధించారు. 1953 నవంబరు 15న జన్మించిన ఈయన.. 1982లో తెలుగుదేశం పార్టీ నుంచి రాజకీయ రంగ ప్రవేశం చేశారు. 1983లో టీడీపీ అభ్యర్థిగా సత్తుపల్లి నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ఎన్టీఆర్ కేబినెట్‌లో చిన్న నీటిపారుదల శాఖ మంత్రిగా పని చేశారు. 1985, 1994,1999లో శాసనసభకు ఎన్నికయ్యారు. సత్తుపల్లి నుంచి నాలుగుసార్లు అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 1995, 1996 లో మరోసారి చిన్న నీటి పారుదల శాఖ మంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు. 1999లో ఎక్సైజ్ శాఖ మంత్రిగా పని చేశారు. 2001లో రోడ్లు భవనాల శాఖ మంత్రిగా ఉన్నారు. 2014లో బీఆర్ఎస్‌లో చేరారు. 2015లో ఎమ్మెల్సీ ఎన్నికై మంత్రిగా పని చేశారు. 2016లో పాలేరు నుంచి అసెంబ్లీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. కేసీఆర్ కేబినెట్‌లో రోడ్లు భవనాల శాఖ మంత్రిగా ఉన్నారు. 2023లో కాంగ్రెస్‌లో చేరిన తుమ్మల నాగేశ్వరరావు ఈసారి ఖమ్మం అసెంబ్లీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. ఎన్టీఆర్, చంద్రబాబు, కేసీఆర్, రేవంత్ రెడ్డి కేబినెట్లలో మంత్రిగా తుమ్మల పని చేసిన రికార్డు సొంతే చేసుకున్నారు. పాలేరు నియోజకవర్గం నుంచి విజయం సాధించిన పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజకీయం చాలా వైవిధ్యమైంది. ఆయన స్వగ్రామం ఖమ్మం జిల్లా నారాయణపురం. 1985లో ఎన్టీఆర్ సీఎంగా ఉన్నప్పుడు పేరువంచ మేజర్‌పై క్రాస్‌వాల్ నిర్మాణం చేసి బిజినెస్‌లోకి అడుగు పెట్టారు. 2013లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి తన రాజకీయాలు స్టార్ట్ చేశారు. 2014లో ఖమ్మం పార్లమెంట్‌కు పోటీ చేసి విజంయ సాధించారు. కొంతకాలం తెలంగాణ వైసీపీ అధ్యక్షుడిగా కూడా ఉన్నారు. ఆ తర్వాత బీఆర్ఎస్ పార్టీలో చేరారు పొంగులేటి. 2023 జులై 2న రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. 2023 జులై 14న టీ-పీసీసీ ప్రచార కమిటీ కో-ఛైర్మన్ గా ఉన్నారు. 2023లో పాలేరు నుంచి పోటీ, ఎమ్మెల్యేగా తొలిసారి గెలుపొంది మంత్రి అయ్యారు. జూపల్లి కృష్ణారావు కొల్లాపూర్ నియోజయవర్గం నుంచి విజయం సాధించారు. 1999లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. కొల్లాపూర్ నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2004, 2009లో గెలుపుతో హ్యాట్రిక్ కొట్టారు. 2012, 2014లో బీఆర్ఎస్ తరపున ఎమ్మెల్యేగా విజయం సాధించారు.

# మంత్రిగా శ్రీధర్ బాబు ప్రమాణం

## మంథనిలో పెద్ద ఎత్తున సంబరాలు

**మంథని,డిసెంబర్7 :** దుద్దిల్ల శ్రీధర్ బాబు అనే నేను రాష్ట్ర మంత్రిగా...–సోనియాగాంధీ, సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో మంత్రిగా శ్రీధర్ బాబు ప్రమాణస్వీకారం చేసారు. మంత్రి ప్రమాణంతో నియోజకవర్గంలో సంబరాలు మిన్నంటాయి. ప్రజలు మిఠాయిలు పంచుకున్నారు. బాణాసంచా కాల్చి చిందులు వేశారు. ప్రమాణ కార్యక్రమానికి మంథని నియోజకవర్గం నుండి అభిమానులు కార్యకర్తలు భారీగా తరలివెళ్ళారు. మంథని నియోజకవర్గం నుండి 5వ సారి ఎమ్మెల్యేగా ఎన్నికైన దుద్దిళ్ల శ్రీధర్ బాబు ను గురువారం రాష్ట్ర మంత్రిగా గవర్నర్ తమిళ్ సై సౌందర్య రాజన్ ప్రమాణస్వీకారం చేయించారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున కార్గే, కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో ఆయన ప్రమాణస్వీకారం చేశారు. తెలంగాణ ఏర్పాటైన తరువాత తొలిసారిగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావటంతో తెలంగాణ ప్రభుత్వంలో తొలిసారిగా మంత్రిగా శ్రీధర్ బాబు కు అవకాశం దక్కింది. శ్రీధర్ బాబుతోపాటు మరో పదిమంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. 2009లో అప్పటి వైఎస్ రాజశేఖర్రెడ్డి ప్రభుత్వంలో రాష్ట్ర మంత్రిగా పనిచేసిన శ్రీధర్ బాబు రాజశేఖర్రెడ్డి మరణించిన తరువాత రోశయ్య మంత్రివర్గంలో, కిరన్ కుమార్రెడ్డి మంత్రివర్గంలో మంత్రిగా పనిచేశాడు. ప్రస్తుతం రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో రాష్ట్రమంత్రిగా మరోసారి ప్రమాణస్వీకరాం చేశారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంథని నియోజకవర్గం నుండి అధిక సంఖ్యలోకాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. 1969లో కాటారం మండలం ధన్వాడలో జన్మించారు. తల్లిదండ్రులు : దుద్దిళ్ల శ్రీపాదరావు, జయమ్మ, భార్యపిల్లలు : శైలజా రామయ్యార్ (సీనియర్ ఐఏఎస్) ఇద్దరు పిల్లలుచదువు : న్యాయవాద విద్యలో ఉత్తీర్ణత ఉమ్మడి రాష్ట్ర హైకోర్టులో న్యాయవాది రాజకీయ అరంగేట్రం : తండి దివంగత స్పీకర్ శ్రీపాదరావు హత్య అనంతరం రాజకీయ ప్రవేశంఎమ్మెల్యేగా : 1999 తొలిసారిగా మంథని ఎమ్మెల్యేగా ఎన్నికైనారు. వరుసగా 2004, 2009, 2018, 2023లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014లో తెలంగాణ ఉద్యమ సమయంలో మంథనిలో ఓటమి చెందారు. 2018లో తిరిగి మంథని ఎమ్మెల్యేగా విజయం, 2023లో 5వ సారి మంథని ఎమ్మెల్యేగా ఎన్నిక మళ్లీ మంత్రి పదవి 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో టిపిసిసి మ్యానిఫెస్టో కమిటి చైర్మన్ గా శ్రీధర్ బాబు వ్యవహరించారు. శ్రీధర్ బాబు మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయగానే మంథని నియోజకవర్గంలో కాంగ్రెస్ కార్యకర్తలు మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు.



# మేం పాలకులం కాదు..సేవకులం..



(మొదటిపేజీ తరువాయి)

ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ తమిళిశై సౌందర రాజన్ ఎల్బీ స్టేడియంలో ఘనంగా జరిగిన కార్యక్రమంలో ప్రమాణం చేయించారు. రేవంత్ అనే నేను అని .. పలకగానే స్టేడియం హోరెత్తిపోయింది. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఏఐసీసీ అగ్రనేతలందరూ తరలి వచ్చారు. ఏఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే, మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, రాహల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాతో పాటు కాంగ్రెస్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు.. ఇతర నేతలు కూడా తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఎల్బీ స్టేడియం కిక్కిరిసిపోయింది. ముఖ్యమైన నేతలందరూ తరలి రావడంతో హైదరాబాద్ మొత్తం సందడిగా మారింది. ఈక్రమంలో ప్రజాభవన్‌లోప్రజాదర్బార్ నిర్వహిస్తామని నూతన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. తెలంగాణ ప్రజలకు ఇవాళే స్వేచ్ఛ వచ్చిందని అన్నారు. పదేళ్లుగా నిరంకుశత్వాన్ని ప్రజలు మౌనంగా భరించారని చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి రాష్ట్రంగా తెలంగాణను తీర్చుదిద్దుతామని స్పష్టం చేశారు. మీ బిడ్డగా.. మీ సోదరుడిగా మీ బాధ్యతలను తాను నిర్వహిస్తానని రేవంత్ చెప్పారు.

# తెలంగాణలో కోలువుదీరిన కొత్త ప్రభుత్వం

(మొదటిపేజీ తరువాయి)

ప్రమాణం చేశారు. తరవాత ఉత్తమ్ కుమార్ రెడ్డి , దామోదర్ రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ , కొండా సురేఖ, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు వరుసగా ప్రమాణం చేశారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఏఐసీసీ అగ్రనేతలందరూ తరలి వచ్చారు. ఏఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే, మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ, రాహల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాతో పాటు కాంగ్రెస్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు సిద్ధరామయ్య,హిమాచల్ ప్రదేశ్ సీఎం సుఖ్విందర్ సింగ్ సుఖ్ ఇతర నేతలు కూడా తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఎల్బీ స్టేడియం కిక్కిరిసిపోయింది. ముఖ్యమైన నేతలందరూ తరలి రావడంతో హైదరాబాద్ మొత్తం సందడిగా మారింది. 64 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వేదికపై నిలిచారు. ప్రమాణం చేసిన వెంటనే సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులు కాంగ్రెస్ అగ్రనేతలను కలుసుకని అభివాదం చేశారు. ప్రమాణస్వీకారం అనుకున్న సమయానికన్నా 15 నిముషాలు ఆలస్యం అయ్యింది. తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేయనున్న సందర్భంగా పలువురు ముఖ్యులు ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. ముఖ్యంగా ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ట్రాఫిక్‌లో ఇరుక్కున్నారు. మల్లికార్జున్ కార్గేతో పాటు తుమ్మల నాగేశ్వరరావు, భట్టి విక్రమార్క ట్రాఫిక్‌లో ఉండిపోయారు. గవర్నర్ తమిళిసై కూడా ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. గవర్నర్ కాన్వాయ్ ఇంకా ట్రాఫిక్‌లోనే ఉండిపోయింది. ఒంటిగంటకు సభకు చేరుకోవాల్సిన గవర్నర్ ట్రాఫిక్ జామ్ వలన ఆలస్యమైంది. స్టేడియం వైపుకు గవర్నర్ కాన్వాయ్‌ను పోలీసులు ముందుకు తీసుకెళ్తున్నారు.



అయితే ట్రాఫిక్‌ను క్లియర్ చేయడంలో పోలీసులు పూర్తిగా విఫలమయ్యారు. అసెంబ్లీ నుంచి ఎల్బీస్టేడియం వరకు భారీగా ట్రాఫిక్ జాం అయ్యింది. అటు ప్రమాణ స్వీకారం చేయబోయే మంత్రులు కూడా ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. ప్రమాణ స్వీకారానికి సమయం దగ్గర పడటంతో నేతల్లో టెన్షన్ నెలకొంది. భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో పోలీసు వైఫల్యాలపై ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు రెండు కిలోమీటర్ల మేర భారీగా ట్రాఫిక్ జాం అయ్యింది. చివరకు అందరినీ ఒకే వాహనంలో ఎల్బీస్టేడియానికి పోలీసులు పంపించి వేశారు. ఇకపోతే ప్రమాణానికి రాష్ట్రం నలుమూలల నుంచి భారీగా ప్రజలు తరలివచ్చారు. ప్రమాణం చేస్తున్న సమయంలో ప్రజలు కేరింతలు కొట్టారు. జై రేవంత్ అంటూ నినాదాలు చేశారు. స్టేడియంలో నినాదాలు మార్మోగాయి.

# రెయిన్‌బోలో రేపటి పౌరులు షో



**రాజన్న సిరిసిల్ల,డిసెంబర్7 :** రాజన్న సిరిసిల్ల జిల్లా సిరిసిల్ల పట్టణంలోని రెయిన్‌బో పాఠశాలలో గురువారం రోజున రేపటి పౌరులు షార్ట్ ఫిలిం విడుదల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పురపాలక సంఘ అధ్యక్షురాలు జిందం కళ చక్రపాణి, జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్, అతిథులుగా కౌన్సిలర్ సభ్యులు గుండ్లపల్లి నీరజ పూర్ణచందర్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పురపాలక సంఘ అధ్యక్షురాలు జిందం కళా చక్రపాణి మాట్లాడుతూ.. పరుశురాం ఇటు ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ ఎంతోమందికి విద్యాబుద్ధులు నేర్పిస్తూ వారి అభిరుచి మేరకు సమాజంలో సామాజిక స్పృహను మేలుకొలిపేలా కుటుంబ విలువలను తెలియజేసేలా నూతన నటి నటులను ప్రోత్సహిస్తూ వారిలో సృజనాత్మకతను పెంపొందించేలా ఎంతో చక్కగా సందేశాత్మకంగా ఈ రేపటి పౌరులు లఘు చిత్రాన్ని చిత్రీకరించిన వారి దర్శకత్వ ప్రతిభకు మా అభినందనలు తెలియ జేస్తున్నామని అన్నారు. అదేవిధంగా ఈ చిత్రంలో నటించిన పిల్లలు ఎంతో చక్కగా నటించారని వారు భవిష్యత్తులో మంచి నటులుగా ఎదగాలని కోరుకుంటున్నామని అన్నారు. ఈ లఘు చిత్రం ప్రదర్శనకు ముందు బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు ముఖ్యమంత్రిగా బిఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు సిరిసిల్ల శాసనసభ్యులు కల్వకుంట్ల తారక రామారావు మంత్రిగా ఉన్న పదవీకాలంలో సిరిసిల్ల ప్రాంతంలో జరిగిన అభివృద్ధిని సిరిసిల్ల ఖ్యాతిని దేశవ్యాప్తంగా విస్తరించిన విధానాన్ని ఎంతో చక్కగా చిత్రీకరించి సిరిసిల్లలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు తెలియపరుస్తున్న పరశురామ్ కి మరొక్క మారు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నామని అన్నారు. ఒకప్పుడు ఎండిపోయిన వాగు వంకలతో చెరువు చెలిమలతో, అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న సిరిసిల్ల ప్రాంతం అనేక రంగాలలో అభివృద్ధి చెంది నేడు సినిమా చిత్రీకరణ కూడా సిరిసిల్ల ప్రాంతంలో చేసుకునే విధంగా అన్ని హంగులతో సౌకర్యాలతో అభివృద్ధి చెందింది కాబట్టి ఈ ప్రాంతంలో మరిన్ని సినిమాల చిత్రీకరణలు జరగాలని ఈ ప్రాంత నటీనటులకు చిత్ర రంగానికి సంబంధించిన సాంకేతిక నిపుణులకు భవిష్యత్తులో చక్కటి అవకాశాలు లభించాలని మనస్ఫూర్తిగా ఈ సందర్భంగా కోరుకుంటున్నాను అని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గుగ్గిళ్ళ జగన్ గౌడ్, రెయిన్బో శ్రీనివాస్, బూర శ్రీనివాస్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు సామల శ్రీనివాస్, వేముల హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పాలనను గాడిలో పెడతామన్న జూపల్లి

## ప్రజల ఆకాంక్షలకు అనగుణంగా పాలన: మల్లు రవి

హైదరాబాద్,డిసెంబర్7(ఆర్ఎన్ఎ):ప్రజా దర్బార్‌తో ప్రజలకు దగ్గరవుతామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మా నిర్ణయాలు చూసి కేసీఆర్‌కు దిమ్మ తిరుగుద్దని అన్నారు. రాష్ట్రంలో నియంత పాలనను అంతమొందించాం. ప్రజా పాలన మొదలు కాబోతోంది. పాలనను గాడిన పెడతాం. ప్రజలు సమస్య చెప్పుకోవడానికి మొన్నటి వరకు అవకాశమే లేదు. ప్రజలందరూ ఎప్పుడైనా ప్రజాభవన్‌కు రావచ్చు. కేసీఆర్ అహంకారం పూర్తిగా దించేస్తాం. చేసిన పొరపాట్లకు కేసీఆర్ పశ్చాత్తాపం చెందాలని సూచించారు.ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణలో పాలన సాగుతుందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు మల్లు రవి వ్యాఖ్యానించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో గురువారం నాడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు 11 మంది మంత్రులు ప్రమాణ స్వీకార చేసిన విషయం తెలిసిందే. అయితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులకు హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మల్లు రవి గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ... తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడింది...తెలంగాణ సంకెళ్లు తెగిపోయాయి. తెలంగాణ ప్రజలకు మరోసారి స్వాతంత్యం÷–ర వచ్చినట్టు అయింది. ప్రజలు కోరుకున్న తెలంగాణ మళ్లీ వచ్చింది. తొలి సంతకం ఆరు గ్యారంటీల మీద చేసి, తొలి ఉద్యోగం ఇచ్చి, ప్రగతి భవన్‌ను జ్యోతిరావు పూలే ప్రజా భవన్‌గా మార్చి, ప్రజా దర్బార్‌కి శ్రీకారం చుట్టడంతో తెలంగాణలో తొలి రోజే ప్రజా ప్రభుత్వం ఏర్పడింది. ప్రమాణ స్వీకార కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ఏఐసీసీ అగ్రనేతలు సోనియా గాంధీ, మల్లిఖార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తదితర నేతలు వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం హర్షణీయం అని మల్లు రవి తెలిపారు.

# ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలలో లింక్డ్ఇన్ సర్వీసెస్ పై వర్క్‌షాప్



**పెద్దపల్లి,డిసెంబర్7 :** పెద్దపల్లి పట్టణంలోని స్థానిక ట్రినిటీ ఇంజనీరింగ్ కళాశాలలో ఇన్స్టిట్యూట్ ఇన్నోవేషన్ సెల్ ఆధ్వర్యంలో పేస్ ప్రిప్ సహకారంతో లింక్డ్ఇన్ సర్వీసెస్ పై గురువారం ఒక్కరోజు వర్క్ షాప్ నిర్వచారు. ఈ కార్యక్రమాని కి ఆ సంస్థ ప్రతినిధి ఎం రోహిత్ కుమార్ పాల్గొని వర్క్ షాప్ నిర్వహించారు ఈ సందర్భంగా అకాడమి డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్ , ప్రిన్సిపల్ డాక్టర్ మణి గణెళిషన్ మాట్లాడుతూ విద్యార్థులకు లింక్డిన్ ప్రీమియం సబ్స్క్రిప్షన్ యాక్టివేషన్ పై అవగాహన కల్పించి తద్వారా విద్యార్థులు 25 వేలకు పైగా నూతన టెక్నాలజీలను, కోర్సులను నేర్చుకోవడం కోసం దోహదపడుతుందని తద్వారా విద్యార్థులు నూతన సాంకేతికతను పెంపొందించుకోవడం కోసం దోహదపడుతుందని తెలిపారు. ప్రస్తుత తరుణంలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సీ, డాటా అనలటిక్స్, డాటా సైన్స్, పైతాన్, జావా ఇలాంటి మరెన్నో కోర్సులు ఉచితంగా విద్యార్థులు నేర్చుకోవచ్చని తద్వారా విద్యార్థులు సులవుగా ఉద్యోగ అవకాశాలు పొందడానికి వీలుంటుందని రానున్న కాలంలో విద్యార్థులకు మరిన్ని కార్యక్రమాలు రూపొందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అకాడమి డైరెక్టర్ డాక్టర్ అశోక్ కుమార్ , ప్రిన్సిపల్ డాక్టర్ మణి గణెళిషన్, ఏఓ సురేష్, రాజిరెడ్డి, టాస్క్ కోఆర్డినేటర్ డాక్టర్ కౌశల్య, మధు శేఖర్, స్వాతి, కృష్ణయ్యతో పాటు ఇతర విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.
తెలంగాణ సిఎం రేవంత్‌కు జగన్ శుభాకాంక్షలు

# ఇరు రాష్ట్రాల మధ్య సహకారం పరిఢవిల్లాలని ఆకాంక్ష

## సుపరిపాలన అందించాలన్న చంద్రబాబు

## లోకేశ్, రామకృష్ణల శుభాకాంక్షలు



**అమరావతి,డిసెంబర్7 :** తెలంగాణలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వానికి ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన రేవంత్ రెడ్డికి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులకు జగన్ శుభాకాంక్షలు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సోదరభావం, సహకారం పరిఢవిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని సీఎం జగన్ అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా ప్రభుత్వంలో రేవంత్‌రెడ్డి ప్రజలకు సుపారిపాలన అందించాలని చంద్రబాబు ఆకాక్షించారు. లోకేశ్ కూడా శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్‌రెడ్డి గురువారం నాడు ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన రేవంత్‌రెడ్డికి సీపీఐ తరుపున శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ... ఇది శుభపరిణామం, తెలంగాణాలో కాంగ్రెస్, సీపీఐ కలిసి పనిచేశాయి. మా అభ్యర్థి కూనంనేని సాంబశివరావు భారీ మెజార్టీతో గెలుపొందారు. ఈ ప్రభుత్వం రాబోయే రోజుల్లో రెండు రాష్ట్రాల మధ్య సామరస్య వాతావరణం ఉండేటట్లు చూడాలి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం విభజన బిల్లులోని హామీలు అమలు చేయకుండా తెలంగాణ, ఆంధ్రా రాష్ట్రాలకు అన్యాయం చేస్తుంది. కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయడానికి రేవంత్‌రెడ్డి ముందుకు రావాలని రామకృష్ణ కోరారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కొత్తగా ప్రమణస్వీకారం చేసిన మంత్రులకు నందమూరి రామకృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్ రెడ్డి నియామకం పట్ల తనకు చాల సంతోషంగా ఉందని, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని విజయవంతంగా కొనసాగిస్తారని నందమూరి రామకృష్ణ వెల్లడించారు. తెలంగాణ కేబినెట్ మంత్రులకు పేరు పేరున అభినందనలు తెలియచేస్తున్నానని నందమూరి రామకృష్ణ చెప్పారు.

# గంజాయి కేసులో 8 మంది నిందితుల అరెస్ట్



**విశాఖపట్నం,డిసెంబర్7 :** విశాఖ జిల్లాలో గంజాయి కేసులో 8 మంది నిందితులను అరెస్ట్ చేసినట్లు డీసీపీ శ్రీనివాస్‌రావు తెలిపారు. గురువారం నాడు డీసీపీ మీడియాతో మాట్లాడుతూ... నవంబర్ 29వ తేదీన అచ్చియ్యంపేటలో భారీగా గంజాయి స్వాధీనం చేసుకున్నారు. 226 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అ÷–దదెకి ఇంటిని తీసుకొని ఈ గంజాయి రవాణా చేస్తున్నారన్నారు. బీబీపట్నం ఏరియాకి మా టీమ్స్ పంపించి తనిఖీ చేశామని చెప్పారు. ఈ కేసులో మొత్తం 8 మందికి అరెస్ట్ చేశామన్నారు. ఈ గంజాయిని ట్రైన్ ద్వారా చెన్నై, ముంబైకి రవాణా చేస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. ఎల్.టీ.టీ , కోణార్క్ ట్రైన్స్ ద్వారా ఈ రవాణా జరుగుతుందన్నారు. ఇంటిని ఎవరికైనా అ÷–దదెకి ఇచ్చే ముందు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డీసీపీ శ్రీనివాస్‌రావు సూచించారు.

# వరదప్రాంతాల్లో ఎమ్మెల్యే సుచరిత పర్యటన



**గుంటూరు,డిసెంబర్7 :** గుంటూరు జిల్లాలో ఎమ్మెల్యే సుచరిత పర్యటించారు. జిల్లాలోని కాకుమానులో మించౌగ్ తుఫాన్ వల్ల నష్టపోయిన వారిని కలిసి భరోసా కల్పించారు. కాకుమానులో వరద ప్రాంతాలను పరిశీలించారు. సుచరిత కారును కాకుమాను ఎస్సీ కాలనీ మహిళలు అడ్డుకున్నారు.ఇళ్లలోకి నీరు వచ్చిందని కనీసం పట్టించుకున్నవారు లేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటి స్థలాలు ఇవ్వలేదని, రహదారులు నిర్మించలేదని మహిళలు ప్రశ్నల వర్షం కురిపించారు. స్థానిక వైసీపీ నేతలు, అధికారులు కనీసం పట్టించుకోలేదని మహిళలు మండిపడ్డారు. పునరావాస కేంద్రాలు ఎక్కడ ఏర్పాటు చేశారో కూడా చెప్పలేదని మహిళల ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి వీధిలో మహిళలు ఎమ్మెల్యేకు సమస్యలను ఏకరువు పెట్టారు. అన్ని ఏర్పాటు చేయిస్తామని చెప్పి ఎమ్మెల్యే సుచరిత అక్కడి నుంచి వెళ్లిపోయారు.

# పొంగులేటి అభిమానుల ఆనందోత్సాహాలు



**ఖమ్మం,డిసెంబర్7 :** పొంగులేటి పేరెత్తగానే కేరింతలు...– మంత్రిగా ప్రమాణ స్వీకారోత్సవంలో ఎల్బీ స్టేడియం దద్దరిల్లింది. తెలంగాణ మూడో అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి కేబినెట్ లో శ్రీనివాసరెడ్డికి చోటు దక్కింది. దీంతో ఖమ్మం జిల్లాలో ఆయన అభిమానులు ఆనందారేకాలు వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేరెత్తగానే ఎల్బీ స్టేడియం ఒక్కసారిగా కేరింతలతో దద్దరిల్లింది. గవర్నర్ తమిళిసై రాష్ట్ర మంత్రిగా ప్రమాణం చేయించిన వెంటనే పొంగులేటి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. గవర్నర్ కు కృతజ్ఞతలు తెలిపిన అనంతరం నేరుగా వెళ్లి ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకగాంధీలతో పాటు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు పొంగులేటి అభివాదం చేసి...ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ దృశ్యాన్ని టీవీల్లో చూసిన ఖమ్మం ప్రజలు స్వీట్లు పంచుకున్నారు. బాణాసంచా కాల్చారు.

# వాగులో గల్లంతయిన ముగ్గరి మృతదేహాలు లభ్యం

అమరావతి,డిసెంబర్7 : ఏపీలో విషాదం చోటు చేసుకుంది. బుధవారం వాగును దాటుతూ గల్లంతైన ముగ్గురు మృతదేహాలు గురువారం లభ్యమయ్యాయి. అల్లూరిజిల్లా అనంతగిరి మండలం భీంపోలు పంచాయతీ సీతపాడు గ్రామానికి చెందిన గెమ్మెల లక్ష్మి(52), మిర్యాల కమల(40), గెమ్మెల కుమార్ (25) బుధవారం కాశీపట్నం వారాంతపు సంతకు వెళ్లి తిరిగి ఆటోలో ఇంటికి వెళుతుండగా లువ్వాగెడ్డ వాగు సమీపానికి వచ్చేసరికి వాగు ఉప్పొంగి ప్రవహిస్తుంది.డ్రైవర్ ఆటోను అక్కడే నిలిపివేయడంతో ముగ్గురు వాగును దాటుతుండగా ప్రమాదవశాత్తు ప్రవాహానికి కొట్టుకుపోయారు. సమాచారం అందుకున్న అధికారులు గాలింపు చర్యలు చేపట్టగా కుమార్ మృతదేహం సమీపంలో లభించగా మిగతా ఇద్దరి మృతదేహాలు గురువారం కొంత దూరంలో లభ్యమయ్యాయి. గిరిజనులైన ఈ ముగ్గురు ఒకే గ్రామానికి చెందిన వారు కావడంతో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# టిటిడి నిధుల మళ్లింపుపై చర్యలు లక్ష్మణ్ డిమాండ్

**న్యూఢిల్లీ,డిసెంబర్7 :** టీటీడీ నిధుల మళ్లింపుపై చర్యలు తీసుకోవాలని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. టీటీడీ అక్రమాలపై గురువారం నాడు రాజ్యసభలో లక్ష్మణ్ లేవనెత్తారు. ఎన్నికల్లో లబ్ది కోసం టీటీడీ నిధులను తిరుపతి కార్పొరేషన్‌కు విడుదల చేస్తోందని చెప్పారు. తిరుమలలో చోళ, పల్లవుల పాలనలో నిర్మించిన పురాతన కట్టడాలు, దేవాలయాలు, మండపాలను కేంద్ర ప్రభుత్వం పరిరక్షించాలని ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు.



# రేవంత్ త్రివిక్రమావతారం ఎత్తాల్సిందే !

తెలంగాణ రెండో ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు నిర్వహించబోతున్న వేళ పదవి కత్తిమీద సాము లాంటిదే. ఎందుకంటే కాంగ్రెస్ ఓ జాతీయ పార్టీ. ప్రాంతీయ పార్టీ అయివుంటే..పరిస్థితి వేరు. జాతీయ పార్టీలో పెత్తనం రకరకాలుగా ఉంటుంది. కాంగ్రెస్‌లో ఒక్క రాజశేఖర్ రెడ్డి మాత్రమే స్వేచ్ఛగా బాధ్యతలు స్వకీరించారు. అన్నింటికి మించి కాంగ్రెస్‌లో ఇప్పుడు రేవంత్ తమ కాంగ్రెస్ నేత కాదన్న ఆత్మన్యూనత పార్టీ నేతల్లో బలంగా నాటుకుంది. ఎందుకంటే టిడిపి నుంచి వచ్చి తెలంగాణ కాంగ్రెస్‌లో పార్టీ పగ్గాలు చేపట్టి సిఎంగా బాధ్యతలు చేపట్టడం కొందరికి ఇప్పటికీ మింగుడు పడని విషయంగానే చూడాలి. ఇప్పుడు మంత్రులుగా చేరిన వారే కాకుండా...బయట ఉన్నవారు కూడా కాంగ్రెస్‌ను బలంగా ప్రజల్లో తీసుకుని వెళ్లగలిగే సత్తా లేనివారే. కెసిఆర్‌ను, బిఆర్‌ఎస్‌ను ఢీకొని గట్టిగా ఎదురొడ్డి నిలిచే సత్తా ఉన్న నేతలు కాంగ్రెస్‌లో లేరనే చెప్పాలి. కేవలం రేవంత్ రెడ్డి మాత్రమే కాంగ్రెస్ అనే నావకు చుక్కానిలా పనిచేశారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో సమతుల్యతను పాటిస్తూ..కెసిఆర్ పాలనను తలపించేలా ముందుకు సాగాలి. ప్రజల ప్రభుత్వమన్న పేరు వచ్చేందుకు కృషి చేయాలి. అలాగే రేవంత్ కూడా త్రివిక్రముడిగా ముందుకు సాగాలి. ఇటు అంతర్గత శత్రువులను, అటు బాహ్య శత్రువులను ఎదుర్కోవాలి. ప్రధానంగా బిఆర్‌ఎస్, బిజెపిలను కూడా ఎదుర్కొనేలా శక్తి సమకూర్చుకోవాల్సి ఉంటుంది. ఇంటాబయట విమర్శలను ఎదుర్కొంటూ ముందుకు సాగాలి. కఠినంగా వ్యవహరించడం కూడా అలవర్చు కోవాలి. నిర్ణయాలు తీసుకోవడంలో నిక్కచ్చిగా వ్యవహరించాలి. ఎన్నికల హామీలను అమలు చేసేలా వ్యూహాలను అమలు చేసుకోవాలి. అటు బిజెపిని, ఇటు బిఆర్‌ఎస్‌ను ఢీకొనే ధైర్యసాహసాలు ప్రదర్శించారు. ప్రధానంగా కెసిఆర్‌ను ధైర్యంగా విమర్శిస్తూ.. కేసులను ఎదుర్కొంటూ ఢీకొనడం ఆషామాషీ వ్యవహారం కాదు. ఈ క్రమంలో కాంగ్రెస్ నేతలు ఈ విషయం గుర్తించి మసలుకోవాలి. సీనియర్లు కావచ్చు..జూనియర్లు కావచ్చు...పార్టీ లైన్ దాటకుండా ప్రభుత్వ ప్రతిష్ట పెరేందుకు అవసరమైన మేరకు మాత్రమే నడుచుకుంటే తప్ప ముమ్ముందు కాంగ్రెస్ మరిన్ని విజయాలు సాధించలేదు. అలాకాకుండా రేవంత్ రెడ్డి కాళ్లల్లో కట్టెలు పెట్టాలని చూస్తే వారే భంగపడతారు. ఇకపోతే కాంగ్రెస్ అధిష్టానం కూడా మార్పు వచ్చింది. రాష్ట్రాల వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం లేదు. సహజంగానే బీఆర్‌ఎస్ పాలనకు.. కాంగ్రెస్ పార్టీ పాలనకు తేడా ఉంటుంది. బీఆర్‌ఎస్ ప్రాంతీయ పార్టీ కావడం వల్ల అక్కడ పార్టీ చీఫ్ కేసీఆర్ చెప్పిందే వేదం.. చేసిందే చట్టం. ఆయన ఎవరి మాటా వినాల్సిన పని లేదు. మంత్రులు కూడా నోరు మెదిపేందుకు అవకాశం లేదు. మాట్లాడమన్నప్పుడే మాట్లాడాలి. రమ్మన్నప్పుడే వచ్చేవారు. ప్రగతిభవన్‌కు ఎప్పుడూ నేరుగా ప్రవేశార్హత లేదు. ఇది ఓ దొరల రాజ్యాంగా చలామణి అయ్యింది. అందుకే కేసీఆర్‌కు హైకమాండ్ అంటూ ఎవరూ లేరు. ఆయనే హైకమాండ్. కానీ కాంగ్రెస్ తరపున ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడుతున్న రేవంత్ రెడ్డికి అటు మంత్రుల నుంచి ఇటు హైకమాండ్ నుంచి కూడా సూచనలు, సలహాలు వస్తూంటాయి. మంత్రులంతా ఒత్తిడితెచ్చి ఇలా జరగాలని కోరే స్వేచ్ఛ కాంగ్రెస్‌లో ఉంటుంది. ముఖ్యంగా మంత్రుల విషయంలో రేవంత్ రెడ్డి ఎన్నో సమస్యలను ఎదుర్కొనే అవకాశం ఉంది. ఎందుకంటే కేబినెట్‌లో రేవంత్ కోరుకున్న వారే కాదు.. హైకమాండ్ చాయిస్‌గా పదవులు పొందిన వారు ఉన్నారు. వారికి రేవంత్ అత్యున్నత స్థాయిలో కూర్చోవడం ఇష్టం లేదు. అందుకే చికాకు పెట్టడానికి ఎప్పటికప్పుడు ప్రయత్నిస్తూ ఉంటారనడంలో సందేహం లేదు. ఇక్కడే రేవంత్ కొంత కఠినంగానే ఉండాలి. ప్రజలకు ఇచ్చిన హామీలు, చేయాల్సిన పనులు లక్ష్యంగానే ముందుకు సాగాలి. వ్యక్తిగత వ్యవహారాలకు ప్రాధాన్యం ఇవ్వరాదు. మరో నాలుగు నెలల్లో పార్లమెంట్ ఎన్నికలు రానున్నాయి. అంతకుముందే పంచాయితీ ఎన్నికలు ఉన్నాయి. వీటిల్లో విజయం సాధించాలంటే వేగంగా దూసుకుపోవాలి. ప్రజల్లో పాలనపట్ల నమ్మకం కలిగించాలి. కేబినెట్‌లో సీనియర్లను సమన్వయం చేసుకోవడంతో పాటు ప్రజలకు భరోసా కల్పించేలా ముందుకు సాగాల్సి ఉంది. ఇందులో ముఖ్యంగా కాంగ్రెస్ అధిష్టానం రేవంత్ రెడ్డికి స్వేచ్ఛ ఇవ్వాలి. అలాగే మంత్రులపై ఆంక్షలు పెట్టాలి. తెలంగాణ మంత్రివర్గంలో ఉత్తమ్ కుమార్ రెడ్డి, భట్టి విక్రమార్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహా అనేక మంది సీనియర్లు చేరారు. వీరంతా పాలనానుభవం ఉన్నవారే కావడం విశేషం. అయితే మారిని పరిస్థితుల్లో వీరు కూడా తమ విధానాలు మార్చుకోవాల్సి ఉంటుంది. తెలంగాణ ఏర్పడ్డ తరవాత పొన్నాల లక్ష్మయ్య, ఉత్తమ్ కుమార్ రెడ్డిల నేతృత్వంలో రెండుసార్లు అసెంబ్లీ ఎన్నికలను ఎదుర్కొన్నారు. ఘోర పరాజయం పాలయ్యారు. తర్వాత గెలిచిన ఎమ్మెల్యేలనూ కాపాడు కోలేకపోయారు. అందుకే ఈ సారి హైకమాండ్ రేవంత్‌లో డైనమిజాన్ని చూసి పగ్గాలు అప్పగించింది. అందుకు తగ్గట్లుగానే రేవంత్ కూడా సత్తాచాటారు. అందుకే కాంగ్రెస్ అగ్రనాయకత్వం ఆయనకే పీఠం అప్పగించింది. రేవంత్ రెడ్డిని సీఎంగా వ్యతిరేకించే వాళ్లు ఇప్పుడు కేబినేట్‌లో ఉన్నారు. రేవంత్ రెడ్డిని చికాకు పెట్టడం చేస్తే ప్రజలు కూడా వారిని గమనిస్తుంటారని గుర్తించాలి. ఎందుకంటే కెసిఆర్‌కు వ్యతిరేకంగా ప్రజాపాలన కోరుకున్న ప్రజలు కాంగ్రెస్‌కు పగ్గాలు అప్పగించారు. ఇక్కడ రేవంత్ కావచ్చు.. ఆయన మంత్రులు కావచ్చు.. లేదా ఎమ్మెల్యేలు కావచ్చు ప్రజాభీష్టం మేరకు నడుచుకోవాలి. కాంగ్రెస్‌లో ఉన్న ఈ సంస్కృతిపై రేవంత్ రెడ్డికి స్పష్టమైన అవగాహన ఉంది. పీసీసీ చీఫ్ గా హైకమాండ్ ఎంపిక చేసిన సమయంలో కోమటిరెడ్డి బ్రదర్స్ ఎన్ని విమర్శలు చేసినా రేవంత్ ఎదురుదాడి చేయలేదు. వారు క్షమాపణలు అడిగితే చెప్పారు. రాజగోపాల్ రెడ్డి మళ్లీ పార్టీలోకి వస్తానంటే... చిన్న అభ్యంతరం వ్యక్తం చేయలేదు. అలాగే.. బహిరంగంగా ఏ సీనియర్ నేతనూ ఆయన వ్యతిరేకించలేదు. కానీ తమకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని.. ఆ సీనియర్లే.. రేవంత్ పై గుర్రుగా ఉన్నారు. ఆరోపణలు చేశారు. అయితే రేవంత్ రెడ్డి మాత్రం తనకు ఇచ్చిన బాధ్యతల్ని పక్కాగా నిర్వహించారు.

# నిజాంపై బాంబు విసిరిన తెలంగాణ విప్లవ వీరుడు

## డిసెంబర్ 8... నారాయణరావు పవార్ వర్ధంతి



(రామ కిష్టయ్య సంగన భట్లు)
94405 95494

ఆయన ఒక పోరాట యోధుడు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన ధీరుడు. ప్రాణాలను పణంగా పెట్టీ, ప్రాణ త్యాగానికి సిద్ధపడ్డ త్యాగ ధనుడు. రాచరికంలో బందీ అయిన తెలంగాణ ప్రజల స్వేచ్ఛాకాంక్షను ప్రపంచానికి చాటడానికి, నిజాం ప్రభువు హత్యకై ఆయనపై బాంబును విసిరిన సాహస వంతుడు. ఆయనే పోరాటాల పురిటిగడ్డ తెలంగాణ ముద్దుబిడ్డ నారాయణ పవార్. బాంబు గురి తప్పినా, ఆయన బందీ అయినా, ఆయన త్యాగ నిరతి, స్ఫూర్తి దాయకం అయింది. పవార్ బాంబు వేసిన సంఘటనను పార్లమెంట్‌లో భగత్‌సింగ్ చేసిన సాహసంతో నాటి ప్రజలు పోల్చుకునే వారు. అయితే ఆ సాహస వీరునికి ప్రాధాన్యత దక్కలేదు. తానే స్వయంగా నిరాహార దీక్ష చేస్తే గానీ రాజకీయ ఖైదిగా గుర్తించలేదు. నాటి తరానికి పవార్ ఆదర్శవంతుడే అయినా, చరిత్ర ఆయన కు తగిన ప్రాధాన్యత ఇవ్వని కారణంగా, నాటి తరానికీ స్ఫూర్తి ప్రదాత అయిన పవార్ పేరు కూడా నేటి తరానికీ తెలియని దుస్థితి శోచనీయం. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చినా, హైదరాబాద్ సంస్థాన ప్రజలు మాత్రం నిరంకుశ బానిసత్వంలో మగ్గక తప్పలేదు. సొంతం చేసుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తూ రజాకార్లను ఉసిగొల్పాడు. నిజాంకు అండగా ఖాసిం రజ్వీ నేతృత్వంలోని రజాకార్లు గ్రామాలపై బడి దోపిడి చేయడం, ఇండ్లు తగల బెట్టడం నానా అరాచకాలు సృష్టించగా, హైదరాబాదు సంస్థానాధీశుడు ఏడవ నిజాం నవాబు ఉస్మాన్ ఆలీ ఖాన్ నుంచి విముక్తి కోసం సంస్థాన ప్రజలు 1946 నుంచి 1948 మధ్య వీరోచిత పోరాటం చేశారు. 1926 అక్టోబర్ 3న వరంగల్‌లో జన్మించిన నారాయణరావు పవార్. బాల్యం నుంచే స్వేచ్ఛ భావాలు కలిగి అణచివేత ఏ రూపంలో ఉన్నా సహించేవాడు కాదు. 8వ తరగతిలోనే ఆర్య సమాజ్‌లో చేరాడు. నిజాం నవాబ్ ఆకృత్యాలు చదివాడు. ప్రత్యక్షంగా చూసాడు. అప్పుడే నిజాం నవాబ్‌కు వ్యతిరేకంగా పోరాడాలని నిర్ణయించు కున్నాడు. కొంత మంది యువకులతో కలిసి "ఆర్య యువక్రాంతి దళ్" ఏర్పాటు చేశాడు. దీనికి కొండా లక్ష్మణ్ బాపూజీ సలహాదారుడుగా ఆర్థిక సహాయం చేశాడు. సమకాలీన రాజకీయాలపై నిరంతరం చర్చించేవారు. " మారు వేశాలలతో వెళ్ళి హైదరాబాద్లో. జిన్నా "రెచ్చగొట్టే ఉపన్యాసం విన్నాడు.

తెలంగాణ సాయుధ పోరుకు సంఘీభావంగా ఏదైనా చేయాలను కున్నారు. ప్రతి దినం సాయంత్రం నిజాం నవాబ్ దారుల్ షిఫాల ఉండే తన తల్లి సమాధిని దర్శించుకు నేందుకు వెళతాడని తెలుసుకుని మిత్రులతో కలిసి నైజాంను చంపాలని, ప్రాణత్యాగానికైనా సిద్ధపడ్డారు. నారాయణ పవార్, పండిత విశ్వనాథ్ బొంబాయి వెళ్లి బాంబులు కొనాలని బయలు దేరారు. మార్గ మధ్యలో షోలాపూర్ వద్ద కొండా లక్ష్మణ్ బాపూజీ కనబడ్డాడు. విషయం చెప్పారు. ఆరు వందల రూపాయ లిచ్చి జాగ్రత్తలు చెప్పి వెళ్లాడు. బొంబాయి వెళ్లి రెండు బాంబులు, రెండు రివాల్వర్లను తీసుకున్నారు. బాంబులు ఫెయిల్ అయితే రివాల్వర్, అదీ ఫెయిల్ అయితే శత్రువుకు మాత్రం చిక్కకూడదు,



పథకం ఎక్కడ పొక్క కూడదు. ఇది పథకం. హైదరాబాద్‌కు వచ్చిన పవార్ నిజాంను ఎందుకు చంపాలనుకున్నది వివరంగా ఒక ఉత్తరం రాసారు. పవార్, జగదీష్, గండయ్యలు దానిపై రక్తంతో సంతకం చేసి నారాయణ స్వామికి ఇచ్చారు. బాంబులు వేసిన తర్వాత విజయవాడకు వెళ్లి ఆ పత్రాన్ని పత్రికలకు, రేడియో సంబంధీకులకు, నారాయణ స్వామి ఇవ్వాలన్నది వారి పథకం. అనుకున్న విధంగా

వారు సంసిద్ధ మైన క్రమంలో, 1947 డిసెంబర్ 4న సాయంత్రం సుమారు 4 గంటల సమయాన, కింగ్‌కోఠి రోడ్డు నుండి తల్లి సమాధి దగ్గరకు వెళ్లే సమయంలో నిజాం ఇంటి ముందే గండయ్య, జగదీష్‌తో కలిసి పవార్ మాటు వేశాడు. పవార్ అందరికంటే ముందు ఉన్నాడు. ఒకవేళ అతని చేతిలో తప్పింకుంటే రెండోవాడు, అక్కడా తప్పితే మూడో వ్యక్తి పూర్తి చేయాలని రెడీ అయ్యారు. నిజాం కారు పవార్ దగ్గరకు రాంగనే కారుపై బాంబు విసిరాడు. అది గురి తప్పింది. కానీ ఆ బాంబు పేలుడుకు ఒక ఆడ మనిషి చనిపోయింది. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే నిజాంపై రివాల్వర్‌తో కాల్చాలను కున్నాడు. ఈలోపే పోలీసులు పట్టుకున్నారు. బాంబు శబ్దం విన్న జగదీష్, గండయ్య పథకం విజయవంతమైందని అనుకొని వెళ్లిపోయారు. లేకుంటే నిజాంకు అదే ఆఖరి రోజు అయ్యేది. సైకిల్ ఆధారంగా గండయ్యను కూడా అరెస్టు చేశారు. ఐదు రోజులు నారాయణ పవార్‌ను పోలీసులు నానా చిత్ర హింసలు పెట్టారు. తన కేసును వాదించడానికి కోవడానికి వకీల్‌ను నియమించు కోక, స్వయంగా తానే తన వాదనలను వినిపించు కున్నాడు. ఎందుకు చంపాలను కు న్నాడో విచారణలో వివరించాడు. చివరికి కోర్టు పవార్‌కు ఉరిశిక్ష విధించింది. 1948 సెప్టెంబర్ 18న అది అమలు కావాల్సి ఉండగా, ఒక్క రోజు ముందు సెప్టెంబరు 17 న నిజాము నవాబు వల్లబాయి పటేల్ ముందు లొంగిపోగా, హైదరాబాద్ సంస్థానం స్వతంత్ర భారత్ లో విలీనం అయి పోయింది. సంస్థానం విముక్తి తర్వాత మిలిటరీ గవర్నర్ మేజర్ జనరల్ జె.ఎన్.చౌదరి, ఉరిశిక్షను యావజ్జీవ కారాగార శిక్షగా మార్చాడు. కాని వివిధ సంస్థల ఆందోళనతో 1949 ఆగస్టు 10న జనరల్ చౌదరి వీరిని విడుదల చేశాడు. అతనితోపాటు గండయ్య కూడా విడుదలయ్యాడు. ఎట్టకేలకు పవార్ 2009 ఆగస్టు 9న నాటి రాష్ట్రపతి ప్రతిభా పాటిల్ ద్వారా పవార్ సన్మానించ బడి నాడు. నారాయణరావు పవార్ 85 యేళ్ళ వయసులో హైదరాబాద్‌లోని కేర్ ఆస్పత్రిలో, 2010, డిసెంబర్ 8 న కన్నుమూసాడు. తెలంగాణ గర్వించ దగిన పవార్ లాంటి దీరులను, త్యాగ ధనులను భావితరాలకు తెలిసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. నాటి చరిత్ర ను మరవకుండా ఉండేందుకు వైయక్తిక, చారిత్రక సంఘటనలను, సందర్భాలను పాఠ్యాంశాలుగా చేయాలి.

# కాంగ్రెస్‌లో కాక రేపిన షర్మిష్ఠ

## రాహుల్ నాయకత్వంపై ప్రణబ్ విమర్శలు

## పుస్తకంలో క్రోడీకరించిన రచయిత్రి



**న్యూఢిల్లీ,డిసెంబర్7 :** కాంగ్రెస్ సీనియర్ నేత, దివంగత రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ కూతురు షర్మిష్ఠా ముఖర్జీ రాసిన ఓ పుస్తకం ప్రస్తుతం రాజకీయాల్లో కలకలంసృష్టిస్తోంది. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీలో అలజడి రేపుతోంది. రాహుల్ గాంధీ నాయకత్వంపై ప్రణబ్‌కి నమ్మకం లేదంటూ ఆ పుస్తకంలో ప్రస్తావించారు. ఇంకా చెప్పాలంటే రాహుల్ పరిపక్వత లేని నాయకుడని ముక్కుసూటిగా చెప్పారు. ఇది ఓ రకంగా రాహుల్‌ను ఎండగట్టేలా ఉందని విమర్శలు వస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీని ముందుకు నడిపించే సామర్థ్యం రాహుల్‌కి లేదని ప్రణబ్ ముఖర్జీ చాలాసార్లు అసహనం వ్యక్తం చేసినట్టు పుస్తకంలో షర్మిష్ఠ పేర్కొన్నారు. ఆమె రాసిన పుస్తకం ఇటీవలే విడుదలైంది. ఆమె కూడా గతంలో కాంగ్రెస్ పార్టీలో పని చేశారు. ఆమె రాసిన బుక్‌లో రాహుల్ గాంధీతో పాటు మొత్తం గాంధీ కుటుంబంపై ప్రణబ్ ముఖర్జీ చేసిన వ్యాఖ్యల్ని ప్రధానంగా ప్రస్తావించారు. ఓ ఉదయం మొఘల్ గార్డెన్స్‌లో ప్రణబ్ ముఖర్జీ మార్నింగ్ వాక్ చేస్తున్నారు. ఆ సమయంలో రాహుల్ గాంధీ ఆయనను కలవడానికి వచ్చారు. మార్నింగ్ వాక్ చేసేప్పుడు ఎవరు డిస్టర్బ్ చేసినా ప్రణబ్‌కి నచ్చదు. అయినా సరే రాహుల్ కలవడానికి వచ్చారు. రాహుల్ సాయంత్రం కలవాల్సి ఉన్నా...కానీ ఆ విషయం సరిగ్గా కమ్యూనికేట్ అవ్వలేదు. ఆ సమయంలోనే మా నాన్న నాతో ఓ మాట అన్నారు. ఉదయం, సాయంత్రానికి తేడా తెలియని వ్యక్తి ప్రధాని ఎలా అవుతారని అసహనం వ్యక్తం చేశారని ప్రసతావించారు. ఈ పుస్తకంలో ప్రణబ్ ముఖర్జీ ఐడియాలజీనీ ఆమె ప్రముఖంగా ప్రస్తావించారు. ప్రస్తుత రాజకీయాలపై ఆయన అభిప్రాయాలనూ వివరించింది. రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వర్తించిన ప్రణబ్ ముఖర్జీ...2020లో కన్నుమూశారు. దాదాపు మూడు తరాల గాంధీలతో సన్నిహితంగా ఉన్నారు ప్రణబ్. రాహుల్ గాంధీ ఎంపీగా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన తొలి రోజుల్లో ప్రణబ్ ముఖర్జీ ఆర్థిక, రక్షణ శాఖ మంత్రిగా పని చేశారు. ఆయన రాసుకున్న డైరీలోని కొన్ని విషయాలనూ ఈ పుస్తకంలో ప్రస్తావించారు. '2014 డిసెంబర్‌లో కాంగరెస్ పార్టీ 130వ వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. ఆ ఈవెంట్‌కి రాహుల్ గాంధీ రాలేదు. కారణాలేంటన్నది తెలీదు. ఆయనకు పార్టీ వేడుకలంటే ఏ మాత్రం గౌరవం లేదు. ఆ సమయంలో సోనియా గాంధీ కూడా ఆందోళన చెందారు. తన తరవాత రాహుల్‌కి పూర్తిగా బాధ్యతలు అప్పగించాలని అనుకున్నారు. ఆయన పార్టీని ముందుకు నడిపించగలరా అని నాన్న అనేవారు అంటూ షర్మిష్ఠ రాసుకుంటూ వచ్చారు. ఇప్పుడీ వివరాలపై కాంగ్రెస్ నేతలు మండిపడుతున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్‌లో ఉన్న షర్మిష్ఠ వ్యాఖ్యలపై ఎలాంటి చర్యలు ఉంటాయో చూడాలి.



## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం

'ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో రేపటి నుండి ప్రతి రోజు, " నేటి కథ" శీర్షికన ఒక కథను ప్రచురించనున్నామని తెలుపుటకు సంతోషిస్తున్నాం. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.com కు పంపవచ్చు...

-ఎడిటర్

# తాత మాట పూల బాట



రామాపురంలో రాజన్న అనే రైతు ఉండేవాడు. అతనికి పంట పొలాలు, కాయగూర, పండ్ల తోటలు ఉన్నాయి. వాటి ఫల సాయంతో రాజన్న బ్రతుకుతున్నాడు. అతనిది ఇతరులను ఆదుకునే తత్వం, అపకారికి కూడా ఉపకారం చేసే మంచి బుద్ధి రాజన్నది. రాజన్న ఒంటరివాడు. అదే ఊరిలో రామాలయానికి ప్రతిరోజు తనకు పండిన కూరలు, పండ్లు తీసుకుని వెళ్లి దేవునికి, పూజారికి ఇస్తూ ఉంటాడు. దైవ ఘటన ప్రకారం ఒక రోజంతా దేవాలయంలో చిన్న పాప ఏడుస్తూ కూర్చుంది. పూజారి ఆ పాపకి ఎవరూ లేరని తెలుసుకుని రాజన్నకి ఈ పాపను నీవు ఇంటికి తీసుకువెళ్లి పెంచుకో నీకు దైవం ఇచ్చిన బిడ్డ అని చెప్పాడు. రాజన్న సంతోషంతో ఆ పాప పేరు అడిగాడు. ఆమె తన పేరు మాలతి అంది. తన వయసు 5 సంవత్సరములు. రాజన్నని ఆ పాప తాత అని పిలుస్తూ తాత మనవరాలు ఆనందంగా బ్రతుకుతున్నారు. రాజన్న మనసులో భగవంతునికి రోజు కృతజ్ఞతలు తెలుపుతూ ఆ బిడ్డని బడిలో చేర్పించాడు. మాలతి చదువులో ముందంజలో ఉండేది. సౌమ్యంగా నెమ్మది తనంతో ఉండేది, చదువుతోపాటు తన పని తాను చేసుకుని తాతకి వంట చేస్తూ ఇంటి పని చేస్తూ 10వ తరగతి లో స్కూల్ ఫస్ట్ ర్యాంక్ సాధించింది. అమ్మా! మాలతి ఈ రోజులలో చదువుతోపాటు సమాజంలో బ్రతుకుట నేర్చుకోవాలి. నీ సౌమ్యత నీ చదువు డాక్టర్ని మరియు కలెక్టర్ ని చేయగలవు కానీ, సమాజంలో గుంట నక్కలు, తోడేళ్ళు వంటి మనుషులు ఉన్నారు. వారి బారి నుండి రక్షించుకునే తెలివి ఉండాలి అని ఝాన్సీ లక్ష్మీభాయి, రుద్రమదేవి లాంటి అనేకమంది నారీమణులు, ధీరులు కథలు చెప్పి తాత మాలతికి ధైర్యం నింపాడు. దానితో మాలతి సమాజంలో ఎలా బ్రతకాలో నేర్చుకుంది. తన బుద్ధితో తన చదువుతో ఐఏఎస్ లో మొదటి స్థానం సాధించింది. తాత మాటలు విని తన జీవితాన్ని పూలబాట చేసుకుంది. మాలతి ఐఏఎస్ అధికారిగా పట్టా తీసుకుంది. అంతేకాక అమ్మాయిల ఉన్నత చదువుల కోసం ఉన్నత పాఠశాలలు, విద్యాలయాలు, కళాశాలలు, ఎన్నో తను కలెక్టర్గా ఉన్నప్పుడు స్థాపించింది. బాల బాలికలంతా ధైర్యంగా చదువుకుని ఉన్నత స్థానాల్లో ఉండాలి అని అనుకుంది. ఓ బాల బాలికలు లారా! ఎదుటి వ్యక్తులు ఎంత మోసగాళ్లో మన తెలివితేటలతో గమనించవచ్చు, అలాంటి వారిని, ధైర్యంగా, తెలివిగా, ఎదుర్కోవచ్చు అని తన ధైర్యమే... తన బలమని.... ఇది ఒక సూక్తిగా మననం చేసుకోండి అని మాలతి బోధనా పాఠ్యాం శాలలో పాఠాలుగా నేర్పించింది. అప్పటి నుండి బాల బాలికలు తనను తాను రక్షించుకొని ఆదిశక్తి రూపాలుగా మారారు. మాలతి తన హయాంలో ఎంతోమంది పోలీస్ ఆఫీసర్లను, ప్రొఫెసర్లను, డాక్టర్లను, ఇంజనీర్లను, ఉపాధ్యాయులను, ధైర్యవంతులైన ప్రభుత్వ అధికారులను తయారు చేసింది. అప్పటినుండి చిన్న పల్లెటూర్లు, పట్టణాలు, జిల్లాలు, మరియు దేశం కూడా నెంబర్ వన్ స్థానం సాధించింది. మాలతి చేసిన ఈ ధైర్యాన్ని, ఈ దేశభక్తిని చూసి నీలాంటి బిడ్డ దేశానికే గర్వకారణం అని ప్రధానమంత్రి గారు ఆమెను పొగడ్తలతో సత్కరించారు ప్రధాన్ జి కి నమస్కరిస్తూ మాలతి ఈ వ్యక్తిత్వం నాకు నా తాత వేసిన పూలబాట అంటూ తాతను కూడా నమస్కరించింది ..అమ్మా మాలతి ! నీవు మాలతి లత లాగా ఊరు నుండి దేశం వరకు అల్లుకుపోయావు తల్లి.... అంటూ రాజన్న ఆనంద భాష్పాలు రాల్చారు..

ఇదే మా తాత వేసిన పూలబాట...

బళ్ళ కృష్ణవేణి,పలాస
శ్రీకాకుళం జిల్లా, 93989 05803

# స్థానిక ఎన్నికలపై రాష్ట్ర ఎన్నికల సంఘం హడావిడి

- కొత్త ప్రభుత్వం ఏర్పడుతున్న వేళ తొందరపాటు చర్య
- కొత్ ప్రభుత్వం ఏర్పడ్డ తరవాత నిర్యం తీసుకునే అవకాశం



**హైదరాబాద్,డిసెంబర్7 :** అసెంబ్లీ ఎన్నికల హడావిడి తగ్గిందో లేదో.. అప్పుడే పంచాయతీ ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమవుతున్నది. పల్లెల్లో ఎన్నికల సందడి మొదలుకాబోతున్నది. మొన్నటికి మొన్న అసెంబలీ ఎన్నికలు ముగియగానే ఇప్పుడు స్థానిక ఎన్నిక సమయం వచ్చింది. అయితే గురువారమే కొత్త ప్రభుత్వం కొలువు దీరినందున దీనిపై ఓనిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. వీటిని వాయిదా వేసుకునే వెసలుబాటు ప్రభుత్వానికి ఉంది. ఎందుకంటే మరో నాలుగు నెలల్లో పార్లమెంట్ ఎన్నికలు కూడా రాబోతున్నాయి. అందువల్ల కేబినేట్ దీనిపై ఆలోచన చేస్తుందా అన్నది చూడాలి. 2024 ఫిబ్రవరి ఒకటితో స్థానిక పాలకవర్గాల గడువు ముగియనుండగా కసరత్తు ముమ్మరం చేసింది. ఎన్నికలు ఎప్పుడు పెట్టినా, వాటిని సమర్థవంతంగా నిర్వహించేందుకు కావాల్సిన ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. అయితే పోలింగ్ కేంద్రాల పరిధిలో ఉండే ఓటర్ల సంఖ్య ఆధారంగా ఎంతమంది ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులను నియమించాలో నిర్దేశిస్తూ, స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. సర్పంచ్ ఎన్నికలను నిర్వహించేందుకు కావాల్సిన ఏర్పాట్లను వెంటనే చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల సంఘం జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీచేసింది. అందుకు సంబంధించిన ఉత్తర్వులను బుధవారం విడుదల చేసింది. ఆ ఆదేశాలు కలెక్టర్లకు అందడంతో యంత్రాంగం సన్నద్ధమవుతున్నది. 2019 జనవరిలో సర్పంచ్ ఎన్నికలు నిర్వహించగా, పాలకవర్గాల పదవీకాలం 2024 ఫిబ్రవరి1తో ముగుస్తున్నది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు ఎప్పుడు వచ్చిన సమర్థవంతంగా నిర్వహించేందుకు కావాల్సిన ఏర్పాట్లను చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నది. అంతేకాదు, పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎంత మంది ఓటర్లు ఉన్నారో.. వారికి తగ్గట్టుగా ప్రిసైడింగ్, పోలింగ్ అధికారులను నియమించాలో నిర్దేశిస్తూ, స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 1తో ప్రస్తుత సర్పంచులతో పాటు పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం పూర్తవుతుంది. ఈ నేపథ్యంలో రాజ్యాంగంలోని 243(3)(ఏ) ఆర్టికల్ ప్రకారం పంచాయతీ రాజ్ సంస్థల ఎన్నికలను ఐదేళ్ల పదవీ కాలం ముగిసేలోపే నిర్వహించాల్సి ఉంటుందని ఎన్నికల సంఘం తన ఉత్తర్వుల్లో పేర్కొన్నది. అంతేకాదు, తెలంగాణ పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 14(2) ప్రకారం గ్రామ పంచాయతీ పాలకవర్గ పదవీకాలం ముగియడానికి మూడు నెలల్లోపు ఎన్నికలను నిర్వహించాల్సి ఉంటుందని చెప్పింది. గడువు ముగుస్తున్న నేపథ్యంలో పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేసింది. అందుకోసం రిటర్నింగ్ అధికారులు, పోలింగ్ సిబ్బందిని నియమించడంతోపాటు పంచాయతీ ఎన్నికల కోసం సదరు సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని సూచించింది. దీంతో పాటు పోలింగ్ కేంద్రాల పరిధిలో సిబ్బందిని నియమించడానికి స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. ఎన్నికల సంఘం ఆదేశాలు జారీచేసిన నేపథ్యంలో జిల్లా అధికారులు అందుకు అనుగుణంగా సిద్ధమవుతున్నారు. సర్పంచ్ ఎన్నికలు ఏ సమయంలోనైనా వచ్చే అవకాశమున్న నేపథ్యంలో వాటిని సమర్థవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 2019 నాటి ఎన్నికలతో పోలిస్తే ఈ సారి ఓటర్లు పెద్ద సంఖ్యలో పెరిగారు. ఈ నేపథ్యంలో వార్డుల వారీగా ఉన్న ఓటర్ల వివరాలను ఆయా జిల్లాల పంచాయతీరాజ్ శాఖ సిద్ధం చేస్తున్నది. దీంతో పాటు పంచాయతీ ఎన్నికల్లో వార్డులు, పంచాయతీలు రిజర్వేషన్లు ప్రకటించాల్సి ఉంటుంది. దీనికోసం అధికారులు గణాంకాలను తీస్తున్నారు. అయితే నూతనంగా ఏర్పడుతున్న ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలపై ఆధారపడి ఉండనున్నది. ఇందుకోసం కొత్త ప్రభుత్వం వచ్చాక ఎన్నికల సంఘం సంప్రదించి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. కానీ హడావిడిగా ఆదేశాలు ఇవ్వడం విమర్శలకు దారితీస్తోంది.

# "బోధించండి" ని మరచిపోతున్నారు

## ఎన్నికల నిర్వహణలో పోలీస్ అధికారులు, సిబ్బంది పనితీరు అభినందనీయం

**జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్**



**జగిత్యాల డిసెంబర్ 07 (ప్రజామంటలు):** సమన్వయంతో పనిచేసి ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో కీలకముగా నిలిచిన పోలీస్ అధికారులు, సిబ్బంది పనితీరు అభినందనీయమని జిల్లా ఎస్పీ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర శాసన ఎన్నికలను విజయంగా నిర్వహించందంలో శ్రమించిన బిఎస్ఎఫ్ అధికారులకు, జిల్లా పోలీస్ అధికారులకు, సిబ్బందికి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రశంసపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.... ఎలాంటి సంఘటనలు జరగకుండా పూర్తిగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల విధుల నిర్వహణలో అధికారులు, సిబ్బంది శ్రమించిన తీరు స్పూర్తిదాయకంగా నిలిచింది. ఈ ఎన్నికల్లో పోలీసులు ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయము పనిచేయడం ద్వారా ఎన్నికల నిర్వహణ మరింత సులభయిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు ప్రభాకర్ రావు, భీమ్ రావు పాల్గొన్నారు.

## "సమీకరించు-పోరాడు" లను అమలు చేస్తున్నారు

**ఎన్ఎస్ఎస్ చైర్మన్ డాక్టర్ బూర్ల**





**మెట్ పల్లి డిసెంబర్ 07 (ప్రజామంటలు):** "భారత రత్న" బీఆర్ అంబేద్కర్ బోధనలైన "బోధించు- సమీకరించు- పోరాడు" అన్న సూత్రాలలో సమీకరించు- పోరాడు"లను మాత్రమే అమలు చేస్తున్నారని, కానీ"బోధించు" అన్న సూత్రాన్ని మరచిపోతున్నారని,అందువల్ల "జ్ఞానం" లేకపోవడంతో ఉద్యమాలు విఫలమవుతున్నాయని మెట్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, జాతీయ సేవ పథకం (ఎన్ ఎస్ ఎస్) ప్రోగ్రాం చైర్మన్ డాక్టర్ బూర్ల చంద్ర శేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం సాయంత్రం కీర్తిశేషులు "భారత రత్న" డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ వర్ధంతి సభ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన ఘన నివాళి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, "భరత రత్న" డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ భరత దేశ రాజ్యాంగ నిర్మాత అని, యోధుడని ప్రశంసిస్తూ,ఆయన బోధనలైన "బోధించు, సమీకరించు, పోరాడు" అన్న సూత్రాలు సక్రమంగా అమలు కావడం లేదని, దాంతో ప్రజలకు సామాజిక న్యాయం లభించడం లేదన్నారు. బోధన అనగా జ్ఞానం అని,ఆ "జ్ఞానం" లేని కారణంగా ప్రజలకు సామాజిక న్యాయం సకాలంలో లభించడం లేదని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రజలకు అన్ని విషయాల పట్ల అవగాహన ఉండటానికి జ్ఞానాన్ని బోధించాలని, అప్పుడే సామాజిక న్యాయం లభిస్తుందని ప్రిన్సిపాల్ డాక్టర్ బూర్ల చంద్ర శేఖర్ ప్రకటించారు.ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారి (పీఓ) మరియు అర్థశాస్త్ర సహాయ ఆచార్యులు కే. వేంకయ్య మాట్లాడుతూ గతంలో అగ్రవర్ణాల ప్రజలకు , బలహీన వర్గాల ప్రజలకు మధ్య అంతరం తీవ్రంగా ఉండేదని,దాంతో అగ్రవర్ణాల ప్రజలు మాత్రం బలహీన వర్గాల ప్రజలను బానిసలుగా మరియు హీనంగా చూసే వారని, అందువల్ల సామాజిక న్యాయం కొరవడిందన్నారు. సామాజిక న్యాయం కోసం డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ ఉద్యమించారని అన్నారు. చివరికి ఆయన చేసిన ఉద్యమాలు ఫలించడంతో భరత దేశ ప్రజలకు సర్వ హక్కులు లభించాయని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కే.వేంకయ్య గుర్తు చేశారు. డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ ఆశయాలను సాధించటానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఉపన్యాసకులు గట్టయ్య, మధు బాబు, అంజయ్య, గణేశ్ తదితరులు పిలుపునిచ్చారు. చివరగా కళాశాల ఇంగ్లీష్ సహాయ ఆచార్యులు బిల్ల రాజేందర్ "వోట్ ఆఫ్ థాంక్స్" చెప్పి, కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య శాస్త్ర ఉపన్యాసకులు మనోజ్ కుమార్, బోధనేతర సిబ్బంది లక్ష్మీ నారాయణ, లింగం, భూలక్ష్మిలతో పాటు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నేర విచారణ మరింత సమర్థవంతంగా ఉండాలి

**నెలవారీ క్రైమ్ మీటింగ్ లో ఎస్పీ సన్ ప్రీత్ సింగ్**



**జగిత్యాల డిసెంబర్ 07 (ప్రజామంటలు):** జిల్లా పోలీస్ ప్రదాన కార్యాలయం లో పోలీస్ స్టేషన్ల పనితీరుపై, నమోదైన కేసుల పై సమీక్ష సమావేశాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.... పోలీస్ స్టేషన్ యొక్క పనితీరును, కేసుల చెదనలో సాధించిన పురోగతిని అంచనా వేసుకుంటూ మరింత దృఢ నిశ్చయతో పనిచేయాలని అధికారులకు సూచించారు. పెండింగ్ కేసులను త్వరితంగా పరిష్కరిస్తూ పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించడానికి ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. డిఎస్పిలు, సి. ఐ లు తమ పరిధిలో ఉండే పోలీస్ స్టేషన్ లలో నమోదైన వివిధ రకాల కేసులు యొక్క స్థితిగతులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సంబంధిత ఎస్.ఐలకు కేసుల దర్యాప్తు కు సంభందించి సూచనలు ఇవ్వాలని సూచించారు. పోలీస్ స్టేషన్ కి వచ్చే ప్రతి ఫిర్యాదుదారుల పట్ల గౌరవంగా వ్యవహరించి సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించే దిశగా కృషి చేసి ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. పెండింగ్ లో ఉన్న కేసులలో త్వరగా పరిశోధన పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేయాలి అని పెండింగ్ కేసులలో ప్లాన్ ఆఫ్ యాక్షన్, ఎస్ఓపి ప్రకారం ఇన్వెస్టిగేషన్ చేసి, కేసులు ఛేదించాలని సూచించారు. ప్రాసిక్యూషన్ లో భాగంగా కోర్టు వారు జారిచేసిన నాన్ బెయిలబుల్ వారెంట్లను నిందితుల పై లేదా తప్పించుకుని తిరుగుతున్న నేరస్తులపై అమలుపరచడానికి అధికారులు, సిబ్బంది అందరూ కృషి చేయాలని సూచించారు. అక్రమ కార్యకలాపాలు అయిన గంజాయి, మట్కా, ఇసుక అక్రమ రవాణా, పేకాట,గుడుంబా పిడిఎస్ రైస్, వాటి పై నిఘా ఉంచి దాడులు నిర్వహించి అరెస్ట్ చేయాలని సూచించారు. మెగా లోక్ అదాలత్ దృష్ట్యా పోలీస్ అధికారులు కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్లు, పోలీస్ సిబ్బంది రాజీ పడ్డ దగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి రాజీ పడేటట్లు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ప్రభాకర్ రావు, భీమ్ రావ్, డిఎస్పీ రంగ రెడ్డి, ఎస్ బి, డిసిఆర్ బి ఇనస్పెక్టర్ లు నాగేశ్వర్ రావు, రాజా రెడ్డి పాల్గొన్నారు.



## అంబరాన్ని అంటిన కాంగ్రెస్ సంబరాలు

**రెండవ ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్ రెడ్డి**

**బీసీ వెల్ఫేర్ క్యాబినెట్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన పొన్నం ప్రభాకర్**



**భీమదేవరపల్లి డిసెంబర్ 07 (ప్రజామంటలు):** మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముల్కనూర్ అంబేద్కర్ కూడలి వద్ద పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ విజయదుంధుబి మోగించి, గురువారం తెలంగాణ రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవంతో పాటు, స్థానిక శాసనసభ్యుడు పొన్నం ప్రభాకర్ బీసీ వెల్ఫేర్ క్యాబినెట్ మంత్రి హోదాలో ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా, భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ లో కాంగ్రెస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా అధ్యక్షురాలు చిదురాల స్వరూప, కాంగ్రెస్ సీనియర్ నాయకులు డబ్బా శంకర్, సాతూరి నాగరాజు, తాళ్లపల్లి సదానందం, జిల్లా నాయకులు గజ్జెల సురేష్, పచ్చునూరి కరుణాకర్, జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి మాడల చింటూ, కాంతారావు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



**మల్లాపూర్ డిసెంబర్ 07 (ప్రజామంటలు):** మల్లాపూర్ మండల్ కేంద్రంలోని మొగలిపేట్ గ్రామానికి చెందిన అభిబ్ ఖాన్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తుండేవాడు కొద్దిరోజుల నుండి అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పేద కుటుంబం కావడంతో ఈ విషయం తెలుసుకున్న మొగిలిపేట్ బిజెపి నాయకులు అండగా ఉంటామని 5000 రూపాయలు కుటుంబానికి ఆర్థిక సహాయం చేసారు.

## శుక్రవారం పొలాస ఆలయంలో కుంకుమార్చన

**జగిత్యాల రూరల్ డిసెంబర్ 7 (ప్రజామంటలు):** జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస లోని 108 శ్రీచక్ర సహిత లాలితమత ఆలయంలో నేడు మహిళలచే కుంకుమార్చన కార్యక్రమం ఉంటుందని ఆలయ ఫౌండరీ ట్రస్టీ చైర్మన్ చెల్లం స్వరూప ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు లలితమాత దేవాలయంలో మహిళలు లలితా సహస్రనామ పారాయణం చేస్తారని స్వరూప వివరించారు. అలాగే ఉదయం 11 గంటలకు ఆలయంలో ప్రతిష్టించిన 108 శ్రీ చక్రాలకు సుహాసినిలు కుంకుమ



పూజలు చేస్తారని, అనంతరం పాల్గొన్న భక్తులకు అన్నదానం ఉంటుందని ఆమే చెప్పారు. భగవత్ బంధువులందరు హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని స్వరూప కోరారు.

## తెలంగాణ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు సంబరాలు

**ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా, ప్రజాస్వామ్యయుతంగా పాలన కొనసాగించాలి**

**తెలంగాణ ఉద్యోగుల సంఘం ఉమ్మడి జిల్లా చైర్మన్: జక్కోజు వెంకటేశ్వర్లు**



**కరీంనగర్ డిసెంబర్ 07 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పది సంవత్సరాలు పూర్తయి ఈరోజు నూతన ప్రభుత్వం కొలువుదీరిన సందర్భంగా కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సంబరాలు నిర్వహించి మిఠాయిలు పంచడం జరిగింది. నూతన ప్రభుత్వానికి ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వానికి పూర్తి స్థాయిలో అండగా ఉంటామని ఉద్యోగుల సంగం నాయకులు తెలిపారు. ముఖ్యంగా తెలంగాణలో 317 జీవో ద్వారా నష్టం జరిగిన ఉద్యోగులకు వెంటనే న్యాయం చేయాలని స్పౌజ్ ఉద్యోగులు రెండు సంవత్సరాలుగా ఉద్యమిస్తున్న గత ప్రభుత్వం పట్టించుకోకుండా భార్యాభర్తలు వేరువేరు జిల్లాలకు అలోకేషన్ చేసి తీవ్ర నష్ట చేశారని ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం ఈ ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. గత ప్రభుత్వము సప్లమెంటరీ బిల్ జిపిఎఫ్ పార్ట్ ఫైనల్స్, సరెండర్ లీవ్స్, మరియు ఇతరత్ర బిల్స్ కూడా సంవత్సరాల తరబడి పెండింగ్లో ఉండడంతో ఉద్యోగులు ఆవేదన చెందారని ఉద్యోగులు వాళ్ళు దాచుకున్న సొమ్మును సైతం యొక్క పెళ్లి , ఆరోగ్య విషయాలకు గానీ ఖర్చు పెట్టుకోవడానికి తీసుకునే అవకాశం ఉండేది. కానీ అవి కూడా రాని పరిస్థితి తలెత్తడంతో ఉద్యోగులు నిరాశ చెందారు. ప్రభుత్వం ఈ సప్లమెంటరీ బిల్స్ విషయంలో చర్యలు తీసుకొని వెంటనే అవి తొందరగా వచ్చే ఏర్పాటు చేయాలని నూతన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉద్యోగులకు ఒకటో తారీఖున జీతాలు చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా నూతన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉమ్మడి జిల్లా చైర్మన్ జక్కోజు వెంకటేశ్వర్లు రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ ఫయాజ్ అలీ జిల్లా నాయకులు సర్దార్ నాగేందర్ సింగ్, డాక్టర్ ప్రణవ్, తిరుపతి చారి, కనకయ్య, కామ శ్రీనివాసు, లింగయ్య, సత్యనారాయణ, జీవన్ రెడ్డి, మాడుగుల రాములు, సంపత్ రెడ్డి జనగామ నర్సింగు, పెంచాల శ్రీనివాస్, నయీమ్, సుధాకర్ చారి తదితరులు పాల్గొన్నారు.

## డీహెచ్ లో ఐ.ఎన్.టీ.యు.సి నాయకుల విజయోత్సవ సభ

**సికింద్రాబాద్ డిసెంబర్ 07 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వ విజయాన్ని కాంక్షిస్తూ పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఐ.ఎన్.టి.యు.సి ఆధ్వర్యంలో డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయం ముందు గురువారం భారీ ర్యాలీ నిర్వహించి విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి బొందుగుల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. గత పది సంవత్సరాలుగా అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఉద్యోగుల హక్కులను విస్మరించింది అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. జీవో 142 విషయంలో నూతన ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్లి ఆ జీవో రద్దు చేయించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర నలుమూలల నుంచి హాజరైనటువంటి ఉద్యోగులు బాణాసంచా పేల్చి ఒకరు స్వీట్లు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్యాంసుందర్, రాష్ట్ర నాయకులు పాపయ్య గౌడ్, మేకల నరసింహారెడ్డి సత్యనారాయణ గౌడ్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు



వేణుగోపాల్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మగరాల శ్రీనివాస్, గోవింద్ రెడ్డి విజయభాస్కర్ అనిల్, ప్రసాద్, ఆంజనేయులు, రాచూరి జ్ఞానేశ్వర్ నటరాజ్, మోహన్ గౌడ్, అంజి, రామారావు రమణ, శివానంద్, రామేశ్వరి, నిర్మల, శోభారాణి నాగమణి, శ్రీలత పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం



**గొల్లపల్లి డిసెంబర్ 07(ప్రజామంటలు):** చిల్వాకోడూరు అంగన్వాడీ కేంద్రంలో సూపర్వైజర్ ఆధ్వర్యంలో మూడు సంవత్సరములు దాటిన పిల్లలకు అంగన్వాడీ కేంద్రంలో అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తల్లులకు అక్షరాభ్యాస కార్యక్రమం ప్రాముఖ్యత గూర్చి అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో బాలామృతం, ఎగ్స్ ఆరు నెలల నుంచి మూడు సంవత్సరాల పిల్లలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి సూపర్వైజర్ మమత, అంగన్వాడి టీచర్ గంగాభవాని, ఐకేపీ సిఏ సులోచన, గర్భవతులు, బాలింతలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

**సెక్రటేరియట్ లో వినతి పత్రం సమర్పించిన**

## ఎన్నారై సెల్ కన్వీనర్ టిపిసిసి డా. షేక్ చాంద్ పాషా



**హైదరాబాద్ డిసెంబర్ 07 (ప్రజామంటలు):** హైదరాబాద్ సెక్రటేరియట్ లో ఎన్నారై సెల్ కన్వీనర్ టిపిసిసి డా. షేక్ చాంద్ పాషా ముఖ్యమంత్రికి వినతి పత్రాన్ని సీఎం పేసీలో సమర్పించి, అనంతరం చీఫ్ సెక్రటరీ మరియు డీజీపీ కార్యాలయాలలోఇచ్చారు. ఎన్నారై పాలసీ కొరకు కృషి చేయాలని ప్రభుత్వ అధికార యంత్రాంగాన్నికోరి, పూర్తి సమాచారం రప్పించుకొని ఇమిగ్రేషన్ 1983 చట్టాన్ని సవరించి ఎన్నారై కోర్టు, ఎన్నారై పోలీస్, ఎన్నారై హెల్ప్ లైన్, సెంటర్ గల్ఫ్, గల్ఫ్ బోర్డ్ నిర్వహించి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని ఎన్నారై కన్వీనర్ షేక్ చాంద్ పాషా 9949321330 వినతి పత్రం సమర్పించారు.

prajamantalau daily pages (07-12)_times of varha main (13-2).qxd 12/8/2023 12:19 AM Page 5



# కొత్తకొండ బ్రహ్మోత్సవాల బహిరంగ వేలం

**టెండర్లు దక్కించుకున్న పాటదారులు**

**పాటదారులు రాని టెండర్లు ఈ నెల 15 కు వాయిదా**



**భీమదేవరపల్లి డిసెంబర్ 07 (ప్రజామంటలు):** ప్రసిద్ధ కొత్త కొండ వీరభద్ర దేవస్థానం బ్రహ్మోత్సవాలు 2024 జాతర సందర్భంగా నిర్వహించిన టెండర్ కం బహిరంగ వేలములలో గుమ్మడికాయలు, కొరమీసాలు అమ్ముకొను హక్కు గొడిశాలకు చెందిన అనగం వెంకటేశ్వర్లు రూ.72,0000 లకు, కొబ్బరి చిప్పలు సేకరణ హక్కు కొత్తకొండకు చెందిన జోడుముంతల రమేష్ కొత్తకొండ రూ.1,03,500 తలనీలాలు సేకరించుకొని హక్కు కొలిపాక కొమరయ్య రూ.15000, బియ్యం, బట్టలు, చీరలు, ఎండుకొబ్బరి ముక్కలు సేకరించుకొనే హక్కు సాయి రూ.1,67,000 రూ. లకు హెచ్చుపాట పాడి టెండర్లు దక్కించుకున్నారు. కొబ్బరి కాయలు, పూట్నాలు, ప్యాలాలు అమ్ముకొను హక్కు మరియు పార్కింగ్ నడుపుకొను హక్కు బహిరంగ వేలములకు పాటదారులు రానందున తిరిగి ఈ నెల 15 కు వాయిదా వేస్తున్నట్లు ఈవో కిషన్ రావు తెలిపారు.

## కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో కోరుట్ల పట్టణంలో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



**కోరుట్ల డిసెంబర్ 07 (ప్రజామంటలు):** కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎనుముల రేవంత్ రెడ్డి నేడు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో కోరుట్ల పట్టణంలో కాంగ్రెస్ అధ్వర్యంలో డైమండ్ రెస్టారెంట్ నుంచి ఫిల్టర్ బెడ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి టపాకాయలు కాలుస్తూ,రంగులు చల్లుకుంటూ డ్యాన్స్ లు చేసుకుంటూ, మిఠాయిలు పంచి పెడుతూ సంతోషం వ్యక్తం చేస్తు వేడుకలు నిర్వహించుకోవడం జరిగింది. ఈ వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు , కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రాష్ట్ర కేబినెట్ బిసి శాఖ మంత్రిగా పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్ లో కాంగ్రెస్ నాయకుల సంబరాలు**





**హుస్నాబాద్ 7 డిసెంబర్ ( ప్రజామంటలు):** హుస్నాబాద్ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా ఎన్నికైన పొన్నం ప్రభాకర్ గురువారం రాష్ట్ర కేబినెట్ బిసి శాఖ మంత్రిగా ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భంగా హుస్నాబాద్ నియోజవర్గంలో ఆరు మండలాల ప్రాంత ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సంబరాలు జరుపుకున్నారు. హుస్నాబాద్ లోని అంబేద్కర్ చౌరస్తాలో హుస్నాబాద్ కాంగ్రెస్ నాయకులు స్వీట్లు పంచుకొని బాణసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బంక చందు, హుస్నాబాద్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిత్తారి పద్మ, పోతుగంటి బాలయ్య, వెన్న రాజు, కొత్తకొండ పోశెట్టి, బోనగిరి రజిత, పచ్చిమట్ల రాధ, కేడం నాగరాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## టిఆర్టిఎఫ్ కోరుట్ల మండల అధ్యక్షుడిగా గంగుల రణధీర్



**కోరుట్ల డిసెంబర్ 07 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టిఆర్టిఎఫ్) కోరుట్ల మండల శాఖ సర్వసభ్య సమావేశంలో గురువారం టిఆర్టిఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల పరిశీలకులు భేతి సాయి కృష్ణ, రంగు రమేష్ లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ మండల శాఖ నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా గంగుల రణధీర్, ప్రధాన కార్యదర్శిగా యం.లక్ష్మి కాంతం ఉపాధ్యక్షులుగా జి. భూమేశ్వర్, జి. శ్రీలలిత, అసోసియేట్ అధ్యక్షులుగా ఎం. సత్యనారాయణ, సహాయ కార్యదర్శులుగా డి. రాజేందర్, ఎ. సరళ, యన్. భవాని, తూడూరి సతీష్ గౌడ్, గోరుమంతుల మూర్తి, ఆర్. పవన్ కుమార్, సి. రాజగంగారం, కోరుట్ల రాజ్ కుమార్ లు ఎన్నికయ్యారు.

## ఆల్ బీసీ మైనారిటీ సంఘ వార్షికోత్సవ సమావేశం

**రాష్ట్ర అధ్యక్షులు, జడ్పీ కోఆప్షన్ మెంబెర్, మహమ్మద్ శుకురోద్దీన్**



**జమ్మికుంట డిసెంబర్ 07 (ప్రజామంటలు):** ఆల్ బీసీ మైనార్టీ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ సంఘ వార్షికోత్సవ సమావేశం కరీంనగర్ లోని ఎస్ డి ఎల్ గెస్ట్ హౌస్ కరీంనగర్లో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆల్ బీసీ మైనార్టీ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ శుక్రుద్దీన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అంకుష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంగం ఏర్పడి నేటికీ సంవత్సరం పూర్తయిన సందర్భంగా ఉన్నటువంటి దూదేకుల నూర్ భాషా, అన్సారీ, పింజారి, కుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నుండి రావాల్సిన సంక్షేమము సంఘ సభ్యులకు అందాలని, ముఖ్యంగా మైనారిటీ లోన్లు, బీసీ బీ నుండి బీసీ ఈ లో చేర్చాలని , మైనారిటీ కార్పొరేషన్ ద్వారా యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని సంఘం ద్వారా పోరాటం చేస్తున్నట్లుగా తెలిపారు. కుల బాంధవులకు ఎటువంటి సమస్యలు వచ్చిన సంఘ సభ్యులను సంప్రదించవచ్చని. సంఘ శ్రేయసే మా ధేయం మని తెలిపారు.ఈ కార్యక్రమం సంఘ నాయకులు ఫర్మాన్, జాకిర్ హుస్సేన్, భాషమియా, మహమ్మద్ అక్బర్, మహబూబ్ అలీ, షబ్బీర్ మియా, అబుభాకర్, అబ్దుల్ సలాం, మహమ్మద్ సులేమాన్, హుస్సేన్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## టీఎస్ సెట్ అర్హత సాధించిన రామకృష్ణ అధ్యాపకులు








**జగిత్యాల డిసెంబర్ 07 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్ర అర్హత పరీక్ష అర్హత సాధించిన రామకృష్ణ అధ్యాపకులు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంచే నిర్వహించబడిన రాష్ట్ర ఉపాధ్యాయ అర్హత పరీక్షలలో రామకృష్ణ డిగ్రీ అండ్ పీజీ కళాశాల చెందిన ముగ్గురు కామర్స్ అధ్యాపకులు జె. రాకేష్, ఆర్. వెంకట సాయి కృష్ణ, టి. రజిత అర్హత సాధించారు. కళాశాల కరస్పాండెంట్ యాద రామకృష్ణ మాట్లాడుతూ ఒకే కళాశాలకు చెందిన ముగ్గురు అధ్యాపకులు అర్హత సాధించడం గర్వకారణమని, అర్హత సాధించిన అధ్యాపకులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కొక్కుల రాజేందర్, పీ.జీ. ప్రిన్సిపల్ వెంకట రమేష్,సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డికి హార్దిక శుభాకాంక్షలు

**తెలియజేసిన జువ్వాడి కృష్ణారావు**



**కోరుట్ల డిసెంబర్ 07 (ప్రజామంటలు):** తొమ్మిదిన్నర సంవత్సరాల కేసీఆర్ అసమర్ధ పాలన నుంచి విముక్తి లభించడం యావత్ తెలంగాణ జాతికి ఒక గొప్ప దినంగా వర్ణించడం జరిగింది.. ఇన్ని రోజులు కేసీఆర్ పాలన అనేది అన్ని వర్గాల ప్రజలకు శాపంలా తయారైన విషయం మీకు తెలిసిందే. యావత్ తెలంగాణ జాతి ఆశీర్వాదంతో, దేశం కోసం గాంధీ నెహ్రూ కుటుంబాలు చేసిన త్యాగాలకు వారసత్వం అయినా తెలంగాణ తల్లి సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ మరియు కాంగ్రెస్ అద్యక్షులు ఖర్గే మద్దతుతో నేడు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఎనుముల రేవంత్ రెడ్డి కి మరియు మంత్రివర్గానికి కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు హార్దిక శుభాకాంక్షలు తెలియజేశారు.

## సాటి వ్యక్తికి రూ. పదివేల ఆర్థిక సహాయం చేసిన విశ్వబ్రాహ్మణ సంఘ పెద్దలు



**చిగురుమామిడి డిసెంబర్ 07 (ప్రజామంటలు):** చిగురుమామిడి మండలం పీచుపల్లె గ్రామ యువకుడు చల్లోజు శ్రీనివాస్ గత పది రోజుల క్రితం అనారోగ్యం కారణంగా మరణించారు. వారి కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని గ్రహించిన సాటి విశ్వబ్రాహ్మణ సంఘ పెద్దలు వారికి పదివేల రూపాయల చిరు సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీరామోజు రాజ్ కుమార్ ప్రధాన కార్యదర్శి గొల్లపల్లి సదాచారి, కోశాధికారి గుగ్గిళ్ళ వేణుమాధవ్ చిగురుమామిడి గ్రామ అధ్యక్షుడు పోలోజు సదాచారి, స్వతంత్రం, దంచనోజు సదానందం, కందుకూరి శ్రీనివాస్, సత్తయ్యనారయణ, వెంకటరమణ, బ్రహ్మచారి, వెంకటయ్య, శ్రీనివాస్ చారి, వెంకటేష్, సదాచారి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాణ స్వీకారానికి తరలివెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు



**చిగురుమామిడి డిసెంబర్ 07 (ప్రజామంటలు):** హైదరాబాద్ ఎల్.బి. స్టేడియంలో జరిగిన ప్రజా ప్రభుత్వ ప్రమాణ స్వీకార మహోత్సవానికి చిగురుమామిడి మండల కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లారు ఈ సందర్భంగా జడ్పీటీసీ సభ్యులు గీకురు రవీందర్ మాట్లాడుతూ.... పదేళ్ల నియంత పాలనకు చరమగీతం పాడి ప్రజాస్వామ్యయుత ప్రభుత్వాన్ని తీసుకువచ్చిన తెలంగాణ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. తరలివెళ్లిన వారిలో జిల్లా ప్రధానకార్యదర్శి చిటుమల్ల రవీందర్, జిల్లా అధికారప్రతినిధి ఐరెడ్డి సత్యనారాయణ రెడ్డి, డిసిసి అధికారప్రతినిధి దాసరి ప్రవీణ్ కుమార్ నేత నాయకులు గునుకుల రాజేశ్వర్ రెడ్డి, పూల లచ్చిరెడ్డి, పోటు మల్లారెడ్డి, పెసరి శ్రీనివాస్, పోలు శ్రీనివాస్, బుర్ర శ్రీనివాస్, బెజ్జంకి అంజయ్య, అనువోజు బాలకృష్ణ చారి, మహమ్మద్ షారూఖ్, జిల్లెల్ల భగవాన్ ప్రసాద్, గుజ్జుల రాజు తదితరులున్నారు.

## సెల్ టవర్ నిర్మాణం ఆపాలి



**కోరుట్ల డిసెంబర్ 07 (ప్రజామంటలు):** కోరుట్ల లోని అయిలాపూర్ రోడ్డులో గల వీరబ్రహ్మేంద్రస్వామి గుడి ఆవరణలో సెల్ టవర్ నిర్మాణం జరుగుతుందని, ఈ సెల్ టవర్ నిర్మాణం జరిగితే రేడియేషన్ వలన విరాట్ నగర్, అయిలాపూర్ రోడ్డులో చంటిపిల్లలకు, బాలింతలకు, గర్భిణీలకు, ప్రజలందరికి అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, కావున సెల్ టవర్ నిర్మాణాన్ని ఆపాలని విరాట్ నగర్ కాలనీ మరియు అయిలాపూర్ రోడ్డు వాసులందరూ డిమాండ్ చేస్తున్నారు. స్వలాభాలకు ఆశపడి స్వర్ణకార సంఘకమిటీ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమారడమే కాకుండా పవిత్రమైన గుడి వాతావరణాన్ని కలుషితం చేసే విధంగా తీసుకున్నటువంటి తప్పుడు నిర్ణయాన్ని తక్షణమే విరమించుకోవాలని కాలినివాసులందరూ ముక్తకంఠంతో డిమాండ్ చేయడం జరిగింది లేని పక్షాన తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని కాలనీవాసులందరూ హెచ్చరిస్తున్నారు ఇట్టి నిరసనలో భాగంగా ఈ రోజు ఆర్డిఓ కు, మున్సిపల్ కమీషనర్, సబ్ ఇన్స్పెక్టర్ లకు, వార్డు కౌన్సిలర్లకు వినతిపత్రం సమర్పించారు.

**కిడ్నీలు పాడై ఆపదలో ఉన్న కుటుంబానికి**

## భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సమితి చేయూత

**జగిత్యాల డిసెంబర్ 07 (ప్రజామంటలు):** మల్యాల మండలంలోని తక్కళ్లపల్లి గ్రామానికి చెందిన దూల హన్మయ్య తన రెండు కిడ్నీలు పాడై పోయి అనారోగ్యంతో బాధపడుతున్నాడని అలాగే కన్నవారు పట్టించుకోక పోవడంతో ఒక చిన్న ఖాళీ స్థలంలో కవర్ లతో ఎండ, వాన నుండి రక్షణ కల్పించుకొని తన భార్యతో సహా నివసిస్తున్నాడని, వారు ఆర్థికంగా నిరుపేద కుటుంబం అని తినడానికి కూడా ఏమీ లేని పరిస్థితులలో దిక్కు తోచకుండా వున్నాడని ఆ ఊరికి చెందిన మన సత్యసాయి సభ్యులు పాలకుర్తి లక్ష్మణ్ సత్యసాయి సంస్థ జగిత్యాల వారికి తెలిపారు. భగవానుని అనుగ్రహ ఆశీస్సులతో "శ్రీ సత్యసాయి సేవా సమితి, జగిత్యాల" ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో రూ. 16,500 లతో వారికి తక్షణ సహాయంగా వంటకి కావలసిన మరియు 25 కేజిల బియ్యం, నిత్యావసర వంట సరుకులన్నీ అందించడం జరిగింది. అలాగే రక్షణగా టార్పాలిన్ కవర్లు మరియు బ్లాంకెట్స్, చెద్దర్లు అందించడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో సంస్థ తరపున కన్వీనర్ బట్టు రాజేందర్, చిటుమల్ల లక్ష్మీనారాయణ, కోటగిరి మహేందర్, అనంతుల అశోక్ , పాలకుర్తి లక్ష్మణ్ గార్లు పాల్గొన్నారు.



## శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంకు రూ. 25,116 విరాళం అందజేత



**కొడిమ్యాల డిసెంబర్ 07 (ప్రజామంటలు):** కొడిమ్యాల మండల కేంద్రంలో పునః నిర్మాణం జరుగుతున్న శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయమునకు కొడిమ్యల మండల కేంద్రనికి చెందిన నాంపెల్లి కృష్ణ - లింగేశ్వరి కుమారుడు అరుణ్ కూతురు అశ్విని ల కుటుంబం ఆలయ నిర్మాణానికి "శాశ్వత చందా దారులు" గా 25,116 (ఇరువై అయిదు వేల ఒక వంద పదహారు) ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయానికి ధన రూపేన సహకరించిన దాతలకు అర్చకులు నాగరాజు రమేష్ స్వామివారి తీర్థ ప్రసాదములు అందజేసి మంగళ శాసనములతో ఆశీర్వదించారు. ఆలయ నిర్మాణానికి సహకరించిన దాతల కుటుంబానికి గ్రామస్తుల తరపున నిర్మాణ కమిటీ తరపున భక్తుల తరపున ప్రత్యేక ధన్యవాదములు. ఇట్టి కార్యక్రమంలో భక్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## కాంప్లెక్స్ ప్రధానోపాద్యాయురాలుకు సన్మానం



**కొడిమ్యాల డిసెంబర్ 07 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలములోని తిరుమలాపుర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు జ్యోస్నాదేవినీ ఘనంగా సన్మానించారు. తిరుమలాపుర్ ఉన్నత పాఠశాలకు స్కూల్ అసిస్టెంట్ నుండి గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలుగా ఇటీవల పదోన్నతి పొంది, కాంప్లెక్స్ హెచ్.ఎమ్. గా బాధ్యతలు స్వీకరించి గురువారం సంద్రాలపల్లి ప్రాథమిక పాఠశాలకు వచ్చిన జ్యోస్నాదేవి ని ప్రధానోపాధ్యా యులు, విద్యార్థులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏనుగు ఆదిరెడ్డి, వివిధ పాఠశాలల స్కూల్ అసిస్టెంట్ లు కవిత, వనజ, శ్యామలాదేవి, పరిమళ, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఒక్కో టీమ్ ఎంత మంది ఆటగాళ్లను తీసుకోవచ్చు

ఐపీఎల్ సీజన్ 17 మినీ వేలానికి కౌంట్ డౌన్ మొదలైంది. డిసెంబర్ 19న జరగనున్న వేలం ప్రక్రియ కోసం మొత్తం 1166 మంది ఆటగాళ్లు రిజిస్టర్ చేసుకున్నారు. అయితే ప్రస్తుతం 10 జట్లలో మొత్తం ఖాళీల సంఖ్య 77 మాత్రమే. అయితే ఇక్కడ ప్రతి జట్టు పర్స్ మొత్తాన్ని బట్టి ఆటగాళ్లకు అవకాశం లభిస్తుంది. అంటే, ఐపీఎల్ నిబంధనల ప్రకారం, ఒక జట్టులో కనీసం 18 మంది, గరిష్టంగా 25 మంది ఆటగాళ్లను తీసుకోవచ్చు. అయితే ఇక్కడ జట్టులో 25 మంది ఆటగాళ్లు ఉండాలనే నిబంధన లేదు. కొన్ని జట్లు తమ పర్స్ ప్రకారం ఆటగాళ్లను కొనుగోలు చేస్తాయి. దీని ప్రకారం ఐపీఎల్ 17వ సీజన్‌లో 10 జట్లలో ఒక్కో టీమ్ ఎంత మంది ఆటగాళ్లను తీసుకోవచ్చో తెలుసుకుందాం రండి.

**1- గుజరాత్ టైటాన్స్ :** ఈ మినీ వేలంలో గుజరాత్ టైటాన్స్ మొత్తం 8 మంది ఆటగాళ్లను కొనుగోలు చేయవచ్చు. ఇందులో ఆరుగురు భారత ప్లేయర్లు, ఇద్దరు విదేశీ ఆటగాళ్లను కొనుగోలు చేయవచ్చు.

**2. సన్‌రైజర్స్ హైదరాబాద్ :** జట్టులో అందుబాటులో ఉన్న మొత్తం స్లాట్‌లు 6. అంటే సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ముగ్గురు భారత ఆటగాళ్లు, ముగ్గురు విదేశీ ఆటగాళ్లను కొనుగోలు చేసే అవకాశం ఉంది.

**3. కోల్‌కతా నైట్ రైడర్స్:** కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టులో ఖాళీగా ఉన్న స్లాట్ల సంఖ్య 12. అంటే ఎనిమిది మంది భారత క్రికెటర్లు, నలుగురు విదేశీ ఆటగాళ్లను తీసుకోవచ్చు.

**4. చెన్నై సూపర్ కింగ్స్ :** జట్టు ఈసారి 6 మంది ఆటగాళ్లను కొనుగోలు చేయవచ్చు. వీరిలో ముగ్గురు విదేశీ ఆటగాళ్లు, ముగ్గురు భారత ఆటగాళ్లను కొనుగోలు చేయవచ్చు.

**5- పంజాబ్ కింగ్స్ :** పంజాబ్ జట్టులో 8 స్లాట్లు ఖాళీగా ఉన్నాయి, ఇద్దరు విదేశీ ఆటగాళ్లు ఆరుగురు స్వదేశీ ఆటగాళ్లను కొనుగోలు చేయవచ్చు.

**6- ఢిల్లీ క్యాపిటల్స్ :** ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీకి 9 స్లాట్‌లు ఉన్నాయి. నలుగురు విదేశీ ఆటగాళ్లు , ఐదుగురు భారత ఆటగాళ్లను తీసుకోవడానికి ఛాన్స్ ఉంది.

**7- రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు :** జట్టు ఈసారి మొత్తం 6 మంది ఆటగాళ్లను కొనుగోలు చేయవచ్చు. వీరిలో 3 విదేశీ ఆటగాళ్లను కొనుగోలు చేయవచ్చు. అలాగే 3 భారత ఆటగాళ్లను కొనుగోలు చేయవచ్చు.




**8- ముంబై ఇండియన్స్ :** రోహిత్ శర్మ నేతృత్వంలోని ముంబై ఇండియన్స్ మొత్తం 8 స్లాట్‌లను కలిగి ఉంది. నలుగురు విదేశీ ఆటగాళ్లు, నలుగురు భారతీయ ఆటగాళ్లను తీసుకోవచ్చు.

**9- రాజస్థాన్ రాయల్స్:** జట్టులో ఖాళీగా ఉన్న 8 స్లాట్‌లలో ముగ్గురు విదేశీ ఆటగాళ్లను తీసుకోవచ్చు. అలాగే 5 మంది భారతీయ ఆటగాళ్లను అనుమతించవచ్చు.

**10- లక్నో సూపర్ జెయింట్స్ :** లక్నో సూపర్ జెయింట్స్ జట్టులో మొత్తం 6 ఖాళీలు ఉన్నాయి. ఈ స్థానాల్లో నలుగురు భారత ఆటగాళ్లు, ఇద్దరు విదేశీ ఆటగాళ్లను కొనుగోలు చేయవచ్చు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ సీజన్ 17 మినీ వేలం డిసెంబర్ 19న దుబాయ్‌లో జరగనుంది. ఈ వేలం కోసం మొత్తం 1166 మంది ఆటగాళ్లు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఈ ఆటగాళ్ల జాబితా షార్ట్‌లిస్ట్ చేస్తారు. ఆ తర్వాత ఆటగాళ్ల వేలం జాబితాను ఫైనల్ చేస్తారు.

# గొడవకు దిగిన టీమిండియా క్రికెటర్లు

భారత జట్టును రెండుసార్లు ప్రపంచ ఛాంపియన్‌గా నిలపడంలో కీలక పాత్ర పోషించిన మాజీ ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్ గౌతమ్ గంభీర్ ఇప్పుడు మళ్లీ బ్యాట్ పట్టుకున్నాడు . గంభీర్ ప్రస్తుతం లెజెండ్స్ క్రికెట్ లీగ్‌లో ఇండియా క్యాపిటల్స్ జట్టుకు కెప్టెన్‌గా ఉన్నాడు. నిలకడగా పరుగులు చేస్తున్నాడు. ఆ జట్టు బుధవారం గుజరాత్ జెయింట్స్‌తో తలపడింది. అయితే ఈ మ్యాచ్‌లో గంభీర్, ప్రత్యర్థి ఆటగాడు టీమిండియా మాజీ స్పీడ్ స్టర్ ఎస్. శ్రీశాంత్ మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. మ్యాచ్ మధ్యలో ఒకరినొకరు తిట్టుకున్నారు. కొద్ది సేపు ఇద్దరి మధ్య మాటల యుద్ధం జరిగింది. సహచర ప్లేయర్లు ఇద్దరికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అంపైర్లు కూడా ఈ ఇద్దరూ బాహాబాహీకి దిగకుండా వారించే ప్రయత్నం చేశారు. అయినా గంభీర్, శ్రీశాంత్ వినలేదు. ఒకనొకదశలో గ్రౌండ్‌లో పరిస్థితి చేయి దాటిపోయేలా కనిపించింది. గంభీర్-శ్రీశాంత్ కొట్టుకుంటారేమోనని చాలామంది ఆందోళన చెందారు. అయితే అంపైర్లు, సహచర ఆటగాళ్లు సర్ది చెప్పడంతో ఇద్దరూ శాంతించారు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళితే.. ఈ మ్యాచ్‌లో గంభీర్ జట్టు తొలుత బ్యాటింగ్ చేసింది. మ్యాచ్ రెండో ఓవర్ శ్రీశాంత్ వేశాడు. శ్రీశాంత్ వేసిన ఓవర్ రెండో బంతికి సిక్సర్ బాదిన గంభీర్ మూడో బంతికి బౌండరీ బాదాడు. దీంతో కాస్త సహనం కోల్పోయిన శ్రీశాంత్ తర్వాతి బంతిని డాట్ బాల్‌గా మలిచాడు. ఇంత వరకు బాగానే ఉంది కానీ శ్రీశాంత్ అనవసరంగా గంభీర్‌ను కవ్వించాడు. తానేం తక్కువ తినలేదంటూ గంభీర్ కూడా నోటితో సమాధానం చెప్పాడు. అలా ఇద్దరి మధ్య మొదలైన మాటల యుద్ధం పరస్పరం కొట్టుకునేదాకా వచ్చింది. కాగా ఈ ఇద్దరు క్రికెటర్లు చాలా కాలం పాటు టీమిండియాకు సేవలు అందించారు. 2007లో టీ20 ప్రపంచకప్‌ను భారత్ గెలుచుకుంది. పాకిస్థాన్‌తో జరిగిన ఫైనల్లో గంభీర్ హాఫ్ సెంచరీ సాధించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. 2011లో, భారత్ వన్డే ప్రపంచకప్‌ను గెలుచుకున్నప్పుడు కూడా గంభీర్ ఫైనల్‌లో 97 పరుగుల ఇన్నింగ్స్ ఆడి జట్టును



విశ్వవిజేతగా నిలిచాడు. ఈ రెండు కీలక మ్యాచ్‌ల్లోనూ శ్రీశాంత్ ఆడడం గమనార్హం.

## 43 బంతుల్లో 193 పరుగులు చేసిన స్పెయిన్ బ్యాట్స్‌మెన్



టీ10 చరిత్రలో రికార్డు సాధించాడు స్పెయిన్ బ్యాట్స్‌మెన్ హమ్జా సలీం దార్.. కేవలం 43 బంతుల్లో 193 పరుగులు చేశాడు. 449 స్ట్రైక్ రేట్‌తో.. అంటే ప్రతి బంతికి 4 పరుగుల కంటే ఎక్కువ పరుగులు చేశాడు. స్పెయిన్‌లో జరుగుతున్న యూరోపియన్ క్రికెట్ సిరీస్‌లో హమ్జా మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. ఈ క్రమంలో.. టీ10 క్రికెట్ ఫార్మాట్‌లో అతిపెద్ద ఇన్నింగ్స్ ఆడిన రికార్డు సృష్టించాడు. మంగళవారం కాటలున్యా జాగ్వార్, సోహల్ హాస్పిటల్ మధ్య ఈ మ్యాచ్ జరిగింది. మొదట కాటలున్యా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. ఈ క్రమంలో ఓపెనర్ గా బ్యాటింగ్ దిగిన హమ్జా విధ్వంసకర ఇన్నింగ్స్‌తో 10 ఓవర్లలో 257 పరుగులు చేసింది. మొత్తం జట్టు స్కోర్‌లో హమ్జా 75 శాతం స్కోర్ చేశాడు. హమ్జా ఇన్నింగ్స్‌లో మొత్తం 22 సిక్సర్లు, 14 ఫోర్లు ఉన్నాయి. దీంతో టీ10 క్రికెట్ ఫార్మాట్‌లో లూయిస్ డు ప్లూయ్ రికార్డును బద్దలు కొట్టాడు. అతని పరుగుల కంటే.. హమ్జా 30 పరుగుల ముందున్నాడు. ఈ ఏడాది అక్టోబర్ 5న హంగరీ తరఫున ఆడిన లూయిస్ 40 బంతుల్లో 163 పరుగులు చేశాడు. ఇదిలా ఉంటే.. హమ్జా సలీం దార్ స్పెయిన్ కు చెందిన క్రికెటర్. అతను.. టీ10 క్రికెట్‌లో 121 మ్యాచ్‌లు ఆడాడు. 34.97 సగటుతో, 232 స్ట్రైక్ రేట్‌తో 3113 పరుగులు చేశాడు. టీ10 ఫార్మాట్‌లో హమ్జా పేరు మీద 3 సెంచరీలు, 18 హాఫ్ సెంచరీలు ఉన్నాయి.

## గ్రూప్-2 నోటిఫికేషన్ విడుదల

**అమరావతి,డిసెంబర్7:** నిరుద్యోగులకు ఏపీ ప్రభుత్వం శుభవార్త అందించింది. గ్రూప్-2 నోటిఫికేషన్‌ను ఏపీపీఎస్సీ విడుదల చేసింది. 897 పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. 331 ఎగ్జిక్యూటివ్ పోస్టులు, 566 నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టులను భర్తీ చేయనున్నారు. డిసెంబర్ 21 నుంచి జనవరి 10 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. వచ్చే సంవత్సరం ఫిబ్రవరి 25న గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించనున్నట్లు ఏపీపీఎస్సీ పేర్కొంది.

## టీ20 ప్రపంచకప్ 2024 నుంచి కోహ్లీ ఔట్..?



క్రికెట్ అభిమానుల దృష్టి ప్రస్తుతం మరో ఆరు నెలల్లో జరగనున్న 2024 టీ20 ప్రపంచకప్ పై పడింది. వన్డే ప్రపంచకప్ 2023లో ఆఖరి మెట్టు పై బోల్తా పడిన టీమ్‌ఇండియా టీ20 ప్రపంచకప్‌ను ఎలాగైన కైవసం చేసుకోవాలని భావిస్తోంది. ఈ క్రమంలో ఆ మెగాటోర్నీ కోసం ఇప్పటి నుంచే జట్టును సిద్ధం చేసే పనిలో భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) నిమగ్నమైంది. ఇందుకోసం ఇటీవల ఢిల్లీలో సమావేశమైన బీసీసీఐ అధికారులు, కెప్టెన్ రోహిత్ శర్మ, కోచ్ రాహుల్ ద్రవిడ్, సెలక్షన్ కమిటీ చీఫ్ అజిత్ అగార్కర్‌లతో కలిసి పొట్టి ప్రపంచకప్ కోసం రోడ్ మ్యాప్‌ను రూపొందించినట్లు తెలుస్తోంది. ఇక వన్డే ప్రపంచకప్ ముగిసిన తరువాత నుంచి అభిమానులను ఓ ప్రశ్న వెంటాడుతోంది. టీ20 ప్రపంచకప్‌లో పరుగుల యంత్రం, రికార్డుల రారాజు విరాట్ కోహ్లీ ఆడతాడా..? లేదా అనేది. వాస్తవానికి టీ20 ప్రపంచకప్ 2022లో సెమీ ఫైనల్‌లో భారత జట్టు ఓడిపోయిన తరువాత ఈ ఫార్మాట్‌లో టీమ్‌ఇండియా తరుపున కోహ్లీ మరో మ్యాచ్ ఆడలేదు. దైనిక్ జాగరణ్ నివేదిక మేరకు మిడిల్ ఆర్డర్‌లో కోహ్లీకి ప్రత్యామ్నాయ ఆటగాడిపై మేనేజ్‌మెంట్ దృష్టి సారించిందట. విరాట్ సాధారణంగా వన్ డౌన్‌లో ఆడుతాడు అనే విషయం తెలిసిందే. ఈ స్థానంలో కోహ్లీకి ప్రత్యామ్నాయంగా ఇషాన్ కిషన్‌ను ఆడించే అవకాశాలను కొట్టి పారేయలేమని ఓ బీసీసీఐ అధికారి దైనిక్ తో చెప్పినట్లు కథనం పేర్కొంది. ఆరంభం నుంచి ఇషాన్ కిషన్ ధాటిగా ఆడగలడని, లెఫ్ట్ హ్యాండర్ కావడంతో జట్టు కాంబినేషన్ సైతం అద్భుతంగా కుదిరే అవకాశం ఉందన్నాడు. విరాట్ కోహ్లీ ఐపీఎల్ 2024లో ప్రదర్శన కూడా పరిగణలోకి తీసుకుంటామని చెప్పాడు. అయితే.. అతడు ఐపీఎల్‌లో ఆర్‌సీబీ జట్టు తరుపున ఓపెనింగ్ స్థానంలో ఆడతాడు కాబట్టి అతడిని ఓపెనింగ్ స్థానంలో అయితే పరిగణలోకి తీసుకోలేమని చెప్పాడు. ఇప్పటికే చాలా మంది ఓపెనర్లు అందుబాటులో ఉన్నారన్నారు. ఇక ఈ ఫార్మాట్‌లో ఏదైన నిర్ణయం తీసుకునే ముందు మాత్రం విరాట్ కోహ్లీతో తన భవిష్యత్తు గురించి సంప్రదించిన తరువాతనే ఉంటుందని చెప్పారు. చూడాలి మరీ బీసీసీఐ విరాట్ కోహ్లీ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో..?

## జగిత్యాలలో కాంగ్రెస్ పార్టీ అనుబంధ విద్యుత్ ఉద్యోగుల సంఘం సంబరాలు




**జగిత్యాల డిసెంబర్ 07 (ప్రజామంటలు):** జగిత్యాలలోని 327 యూనియన్ ఆఫీస్ అవరణలో సంఘం నాయకులు మరియు సభ్యులు ఏర్పాటు చేసిన కాంగ్రెస్ విజయోత్సవ కార్యక్రమంలో జిల్లా నాయకులు అయిన ఐఎన్‌టియూసి సెక్రెటరీ రాంజీ నాయక్, ప్రెసిడెంట్ తిరుపతి, రజమల్లు, బాలు నాయక్, హరిప్రసాద్, వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడుతూ కార్మికుల పక్షమైన ప్రభుత్వం ఏర్పడడం చాలా సంతోషకరన్నారు. కార్మికుల సమస్యల పోరాటాలకు ఫలితం ఈ ప్రభుత్వం తో లభిస్తుందని ఆశిస్తున్నాం. బాణసంచా పేల్చి, మిఠాయిలు పంచుకుని సంతోషం వక్తం చేశారు.

## ముంబై ఇండియన్స్ కెప్టెన్‌గా అతడే 'సరైనోడు'!



ప్రస్తుతం ముంబై ఇండియన్స్ కెప్టెన్‌గా రోహిత్ శర్మ ఉన్నాడు. ఇప్పుడు రోహిత్ వయసు 36 ఏళ్లు కాబట్టి.. భవిష్యత్తు కెప్టెన్ కోసం ముంబై ఫ్రాంచైజీ ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగానే ఐపీఎల్ 2024 మినీ వేలంకు ముందు గుజరాత్ టైటాన్స్ కెప్టెన్‌గా ఉన్న హార్దిక్ పాండ్యాను ముంబై ట్రేడ్ చేసుకుంది. వచ్చే సీజన్ కాకపోయినా.. ఆ తర్వాతి ఎడిషన్‌లలో హార్దిక్ జట్టు పగ్గాలు అందుకోనున్నాడు. అయితే ముంబై కెప్టెన్‌గా హార్దిక్ కంటే సూర్యకుమార్ యాదవ్ సరైనోడని భారత మాజీ క్రికెటర్ అజేయ్ జడేజా అంటున్నాడు. టీ20 ప్రపంచకప్ 2024 కోసం ఐపీఎల్ 2024 సీజన్ ఆడకుండా రోహిత్ శర్మ విశ్రాంతి తీసుకోవాలని అజేయ్ జడేజా పేర్కొన్నాడు. రోహిత్ మాత్రమే కాదు ఇతర భారత ఆటగాళ్లు కూడా టీ20 ప్రపంచకప్ కోసం ఐపీఎల్ 2024 ఆడకుండా ఉండాలన్నాడు. 'ఐపీఎల్ 2024 సీజన్ నుంచి రోహిత్ శర్మ బ్రేక్ తీసుకుంటే.. సూర్యకుమార్ యాదవ్ ముంబై ఇండియన్స్ జట్టును నడిపించాలి. ఐసీసీ టోర్నీల్లో రాణించాలంటే.. భారత ఆటగాళ్లు ఐపీఎల్‌కు బ్రేక్ ఇచ్చి ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టాలి. విదేశీ ఆటగాళ్లు ఇదే చేస్తున్నారు. కానీ భారత ఆటగాళ్లు మాత్రం ఐపీఎల్ ఆడుతున్నారు. కనీసం టీ20 ప్రపంచకప్ 2024 కోసమైనా ఐపీఎల్ 2024 ఆడకుండా ఉండాలి' అని జడేజా సూచించాడు.

## శుభ్‌మాన్ గిల్ పక్కనే బాలీవుడ్ హాట్ నటి!



వన్డే ప్రపంచకప్ 2023 తర్వాత టీమిండియా యువ ఓపెనర్ శుభ్‌మాన్ గిల్ విశ్రాంతి తీసుకున్నాడు. మెగా టోర్నీ అనంతరం ఆస్ట్రేలియాతో జరిగిన ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో ఆడని గిల్.. ఇటీవల లండన్‌కు వెళ్లాడు. అక్కడి వీధుల్లో స్నేహితులతో కలిసి చక్కర్లు కొట్టాడు. అయితే గిల్ పక్కన బాలీవుడ్ హాట్ నటి అవనీత్ కౌర్ ఉండడం విశేషం. గిల్, అవనీత్ లండన్‌లో దిగిన ఫోటోలు ప్రస్తుతం ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నాయి. శుభ్‌మాన్ గిల్, అవనీత్ కౌర్‌లు ఓ పాట షూటింగ్ కోసం లండన్‌కు వెళ్లినట్లు తెలుస్తోంది. ఓ పంజాబీ ఆల్బమ్ కోసం గిల్, అవనీత్ లండన్‌కు వెళ్లారట. వీరితో పాటు నిర్మాత రాఘవ శర్మ, అన్షుల్ గార్గ్ కూడా ఉన్నారు. వీరంతా కలిసి లండన్ వీధుల్లో ఉన్న ఫోటోలు నెట్టింట వైరల్ అయ్యాయి. భారత జట్టులో ఇప్పటికే మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న గిల్.. ఈ పంజాబీ ఆల్బమ్‌లో నటిస్తే అది బంపర్ హిట్ అవడం ఖాయం అని చెప్పొచ్చు. సచిన్ టెండూల్కర్ కూతురు సారా టెండూల్కర్‌తో శుభ్‌మన్ గిల్ డేటింగ్ చేస్తున్నాడని గత కొంతకాలంగా సోషల్ మీడియాలో పుకార్లు షికార్లు చేస్తున్న విషయం తెలిసిందే. గిల్, సారా కలిసి రెస్టారెంట్లకు తిరగడం.. సోషల్ మీడియాలో ఒకరి పోస్టులకు ఒకరు లైకులు కొట్టడం.. గిల్ ఆడే మ్యాచ్‌లకు సారా రావడంతో ఈ ఇరువురి మధ్య సంమ్‌థింగ్ సంమ్‌థింగ్ అని గాసిప్స్ వస్తున్నాయి. అయితే తమ మధ్య ఉన్న రిలేషన్‌షిప్‌పై ఈ ఇద్దరూ ఇంతవరకూ స్పందించలేదు.

## ప్రజాప్రతినిధుల కేసులో హైకోర్టు కీలక నిర్ణయం

**అమరావతి,డిసెంబర్7:** ప్రజాప్రతినిధుల కేసుల విచారణను వేగవంతం చేసేందుకు ఏపీ హైకోర్ట్ కీలక చర్యలు చేపట్టింది. సుమోటోగా పిల్‌ను హైకోర్టు నమోదు చేసింది. ఇందులో చీఫ్ సెక్రటరీ, డీజీపీ, స్పెషల్ పీపీ విజయవాడ ప్రజా ప్రతినిధుల కోర్ట్‌లను ప్రతివాదులుగా హైకోర్ట్ చేర్చింది. ఈ పిల్‌పై ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. విచారణకు అడ్వకేట్ జనరల్ ఉండాలని ధర్మాసనం అభిప్రాయ పడింది. ఒఉ సోమవారం వస్తారని వాయిదా వేయాలని స్పెషల్ పీపీ హైకోర్ట్‌ని కోరారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ఆదేశాలు జారీ చేయాల్సి ఉందని హైకోర్ట్ పేర్కొంది. కేసుల విచారణ వేగవంతం చేయాలని చెప్పింది.ట్రయల్ కోర్టులను పర్యవేక్షించేందుకు హైకోర్ట్‌లో ప్రత్యేక బెంచ్ ఏర్పాటు చేసింది. తప్పనిసరి పరిస్థితుల్లో మినహా ట్రయల్ కోర్టులు విచారణ వాయిదా వేయకూడదని సుప్రీం ఆదేశించింది.

prajamantalau daily pages (07-12)_times of varha main (13-2).qxd 12/8/2023 12:19 AM Page 7



# ముందుగా రెండు గ్యారెంటీల అమలు

**9నుంచి మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం**

**రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి పదిలక్షలకు పెంపు**

**నిరంతర విద్యుత్ సమర్థంగా అమలు**

**కేబినేట్ భేటీ వివరాలు వెల్లడించిన మంత్రి శ్రీధర్ బాబు**



హైదరాబాద్,డిసెంబర్7: మహిళలకు ఉచిత రవాణా సౌకర్యం, రాజీవ్ ఆరోగ్య శ్రీలో భాగంగా పదిలక్షల వరకూ పెంపు గ్యారంటీలను ముందుగా అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. డిసెంబర్ 9 నుంచి వీటిని అమలు చేస్తామన్నారు. ఈనెల 9 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణమని ఆర్థిక శాఖ మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. గురువారం నాడు సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన తొలి కేబినేట్ భేటీ అయ్యింది. ఈ భేటీ గురించిన వివరాలను మీడియాకు శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మీడియాతో మాట్లాడుతూ...ఈనెల 9న రెండు గ్యారెంటీలు అమల్లోకి తెస్తాం. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంచాం. రాబోయే ఐదేళ్లలో ప్రజలు కోరుకునే మార్పు చూపిస్తాం. విద్యుత్ అంశంపై ఉన్న గ్యారంటీలో భాగంగా కోతలు లేని విద్యుత్ సరఫరా కోసం అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని నిర్ణయించామని అన్నారు. తెలంగాణ కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, చర్చించిన అంశాల గురించి రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు మీడియాకు వివరించారు. తాము ఎన్నికలకు ముందు ప్రకటించిన 6 గ్యారంటీలను అమలు చేయడం కోసం ఈ మొదటి కేబినెట్ సమావేశంలో చర్చించామని వివరించారు. అమలు చేసే ప్రక్రియలో భాగంగా ప్రతి గ్యారంటీ విషయంలో సుదీర్ఘంగా చర్చించామని అన్నారు. తమ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత ఈ మొదటి కేబినెట్‌లో రెండు గ్యారంటీలను అమలు చేయాలని నిర్ణయించామని చెప్పారు. రేపు మళ్లీ ఈ రెండు గ్యారంటీలపై సుదీర్ఘంగా ఆయా విభాగాల ఉన్నతాధికారులతో చర్చించి డిసెంబరు 9న వాటిని మొదలు పెడతామన్నారు. 2014లో ఇప్పటిదాకా విద్యుత్ రంగంలో అనేక తప్పులతడకలు ఉన్నాయని చెప్పారు. ఈ అంశాలపై కూడా చర్చించామని అన్నారు. రేపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీతో సమావేశమై సమీక్ష జరుపుతారని అన్నారు. దీంట్లో కరెంటు రంగానికి సంబంధించి అనేక అంశాలు చర్చిస్తారని చెప్పారు. ఆరు గ్యారెంటీలపై కేబినెట్‌లో చర్చించాం. రేపు 2 గ్యారెంటీలకు సంబంధించి ఆయా శాఖలతో సీఎం చర్చిస్తారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రజలకు తెలియాలి. శ్వేతపత్రం సిద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. 2014 నుంచి 2023 డిసెంబర్ 7వ తేదీ వరకు ప్రభుత్వ వ్యయాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు.

## సింగరేణి ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరాలి

**సింగరేణి సంఘ నాయకులతో ఎమ్మెల్సీ కవిత**



హైదరాబాద్,డిసెంబర్7: సింగరేణి సంస్థ పురోగమనానికి టీబీజీకేఎస్ గెలుపు చాలా అవసరమని, సింగరేణి ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ఆ సంఘం గౌరవ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. సింగరేణి సంస్థ ఎన్నికల నేపథ్యంలో టీబీజీకేఎస్ సంఘం నాయకులు, ముఖ్య కార్యకర్తలు గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కవితతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ... కార్మికుల హక్కులు, ప్రయోజనాల సాధనకు సంస్థను నిద్రపోనివ్వ బోమని సింగరేణి అంటే సింహగర్జన అని, అదే స్ఫూర్తితో పనిచేస్తూ సంస్థను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని కవిత అభిప్రాయపడ్డారు. డిపెండెంట్ ఉద్యోగాల కోసం బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ తీవ్రంగా కృషి చేశారని గుర్తు చేశారు. డిపెండెంట్ ఉద్యోగాల విషయంలో కొంత మంది కోర్టుల్లో కేసులు వేసి ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేసినా, అధికారులు కుదరదని చెప్పినా సరే కేసీఆర్ నిబంధనలను సవరించి వీలైనంత ఎక్కువ మందికి ఉద్యోగాలు వచ్చేలా చర్యలు చేపట్టారని కవిత వివరించారు. కార్మికులు ఆర్థికంగా ఎదిగేలా చేయడమే కాకుండా ఆత్మగౌరవం ఇవ్వాలన్న ఆలోచనతో కేసీఆర్ అనేక కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. సింగరేణి పనితీరును మెరుగుపర్చడానికి, కార్మికుల సంక్షేమానికి కేసీఆర్ చేసిన మంచి పనులను కార్మికుల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కేసీఆర్ చేసిన పనులను కార్మికులకు సరిగ్గా వివరిస్తే టీబీజీకేఎస్‌కు ఎదురుండదని కవిత వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో బొగ్గు గని కార్మికులు ప్రధాన భూమిక పోషించారని, సింగరేణి కార్మికులకు ఉన్న పోరాట స్ఫూర్తి జాతీయ సంఘాలకు లేదని కవిత చెప్పారు. గనులల్లో కార్మికులు చేస్తున్న కష్టం, చిందిస్తున్న చెమట తెలంగాణలో వెలుగులు నింపుతోందని కాబట్టి ధైర్యంగా పోరాటం చేయాలని దిశానిర్ధేశర చేశారు. అధికారం ఉన్నా లేకున్నా తెలంగాణ కోసం పోరాటం చేసి సాధించామని, ఈ సింగరేణి ఎన్నికల్లో గులాబీ జెండాను ఎగరేస్తా మనడంలో ఎలాంటి సందేహం లేదని తేల్చిచెప్పారు. ఎన్నికల్లో ఒక్కొక్కరు ఒక్కో కేసీఆర్‌లా పనిచేయాలని కవిత అన్నారు. మేనిఫెస్టో కమిటీని ఏర్పాటు చేస్తామని, అతి త్వరలో తమ సంఘం మేనిఫెస్టోను విడుదల చేస్తుందని కవిత ప్రకటించారు. ఎన్టీయూసీ, ఏఐటీయూసీ వంటి జాతీయ సంఘాలు సింగరేణి హక్కులను ఏనాడూ కాపాడలేదని, భవిష్యత్తులోనూ సంఘాలను సింగరేణి ఎదుగుదల కోసం ఏమీ చేయలేవన్నారు. టీబీజీకేఎస్ గుర్తింపు సంఘంగా ఉండగా ఒక్క సమ్మె కూడా చేసే అవసరం లేకుండా అన్ని పనులను సాధించి పెట్టామని కవిత తెలిపారు. సింగరేణి అంటే తమకు ప్రాధాన్యత ఉందని, కానీ కాంగ్రెస్ ప్రాధాన్యతల్లో సింగరేణి, ఆ సంస్థ కార్మికులు లేరని తేల్చిచెప్పారు. ఏ అధికారం లేనప్పుడే తెలంగాణ సాధించామని, అలాంటిది కార్మికుల హక్కులు, ప్రయోజనాలు సాధించడానికి సింగరేణి సంస్థ యాజమన్యాన్ని నిద్రపోనివ్వబోమని తెలిపారు. తమకు పోరాటాలు కొత్తకాదని, కార్మికుల హక్కులను సాధించే వరకు విశ్రమించబోమని, కార్మికుల పక్షాన ప్రతి నిత్యం నిలబడి ఉంటామని కవిత పునరుద్ఘాటించారు. సింగరేణి సంస్థలో దాదాపు 40 వేల ఉద్యోగులు ఉంటే 21 వేల వరకు యువకులు ఉన్నారని ప్రస్తావించారు. కాబట్టి సంఘం నాయకత్వ బాధ్యతల్లో యువతకు ప్రాధాన్యత ఇస్తామని, యువతను సింగరేణిని నడపడంలో చోదక శక్తిగా తీర్చిదిద్దుతామని కవిత చెప్పారు. అన్ని కమిటీల్లోనూ యువతకు సరైన ప్రాధాన్యత ఇస్తామని, మహిళలకు కూడా అవకాశాలు కల్పిస్తామని కవిత పేర్కొన్నారు.

# హాయ్ నాన్న... ట్విట్టర్ రివ్యూ వచ్చేసింది...

**ఓవరాల్‌గా ఫ్యామిలీ అడియన్స్ మెప్పించిన హాయ్ నాన్న**

టాలీవుడ్ న్యాచురల్ స్టార్ నాని హీరోగా నటించిన తాజా చిత్రం 'హాయ్ నాన్న'. నాని 30గా తెరకెక్కుతున్న ఈ సినిమాతో శౌర్యువ్ దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. తాజాగా ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇక ఈ సినిమా సోషల్ మీడియా రివ్యూలు చూసుకుంటే.. బొమ్మ బ్లాక్ బస్టర్ అని తెలుస్తుంది. కథలోకి వెళితే.. ముంబైకి చెందిన విరాజ్(నాని) ఓ ఫ్యాషన్ ఫోటోగ్రాఫర్. తన కూతురు మహి(బేబీ కియారా ఖన్నా) అంటే విరాజ్‌కు ప్రాణం. పుట్టుకతోనే అరుదైన వ్యాధితో బాధపడతున్న మహికి అన్నీ తానై చూసుకుంటాడు. అయితే ప్రతి రోజు రాత్రి కూతురికి సరదాగా కథలు చెప్పడం విరాజ్‌కి అలావాటు. ఆ కథల్లోని హీరో పాత్రని నాన్నతో పోల్చుకోవడం మహికి అలవాటు. ఓ సారి అమ్మ కథ చెప్పమని అడుగుతుంది మహి. నువ్వు క్లాస్ ఫస్ట్ వస్తే చెబుతానంటాడు. అమ్మ కథ కోసం కష్టపడి చదివి క్లాస్ ఫస్ట్ వస్తుంది. అయినా మహికి తన అమ్మ కథని చెప్పడు విరాజ్. అయితే మహీకి అమ్మ గురించి చెప్పడానికి విరాజ్ ఎందుకు ఆలోచిస్తుంటాడు. అసలు విరాజ్ భార్య ఎవరు, ఆమె ఎందుకు విరాజ్‌ను వదిలేసి వెళ్ళిపోయింది ?, విరాజ్ జీవితంలోకి యశ్న (మృణాల్ ఠాకూర్) ఎలా వస్తోంది ? అనేది తెలియాలంటే హాయ్ నాన్న మూవీ చూడాల్సిందే. ఇక ఈ సినిమా చూసిన నెటిజన్లు హాయ్ నాన్న ఒక ఎమోషనల్ రైడ్ అని చెబుతున్నారు. ముఖ్యంగా కథలోని భావోద్వేగాలు, మలుపులు, నాని, మృణాల్, బేబి కియారా నటన, సినిమా బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ సినిమాకు హైలెట్‌గా నిలిచాయని చెబుతున్నారు. అయితే సినిమాలో కొన్ని సీక్వెన్సె స్లోగా సాగడం, అలాగే కొన్ని రొటీన్ సీన్స్ సినిమాకి మైనస్ అయ్యాయని తెలిపారు. ఓవరాల్ గా ఈ 'హాయ్ నాన్న' చిత్రం ఫ్యామిలీ ఆడియన్స్ ను చాలా బాగా మెప్పిస్తోందని అంటున్నారు.




## ఎన్‌టిఆర్‌తో అన్నీ సినిమాలాగా తీయను : ప్రశాంత్ నీల్

కేజీఎఫ్ సినిమాతో కన్నడ సినీ పరిశ్రమను ప్రపంచ స్థాయికి తీసు కెళ్లాడు దర్శకుడు ప్రశాంత్ నీల్. ఆ తర్వాత కేజీఎఫ్ 2తో గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద రికార్డులను బద్దలు కొట్టేశాడు. ప్రస్తుతం పాన్ ఇండియా స్టార్ ప్రభాస్‌తో మరో ట్రెండ్ క్రియేట్ చేసే సలార్‌ను తెరకెక్కించాడు. ఈ సినిమా డిసెంబర్ 22న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఈ సినిమా అనంతరం టాలీవుడ్ స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్‌తో ఎన్టీఆర్ 31 సినిమా చేయనున్నాడు. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించి మేకర్స్ పోస్టర్ విడుదల చేయగా మంచి రెస్పాన్స్ వచ్చింది. అయితే ఈ క్రేజీ కాంబో షూటింగ్ ఎప్పుడు మొదలవుతుందా..ఎప్పుడెప్పుడు సినిమా నుంచి అప్?డేట్‌లు వస్తాయా అని తారక్ ఫ్యాన్స్ ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి నీల్ ఒక సాలిడ్ సర్‌ప్రైజ్ ఇచ్చాడు. ప్రస్తుతం సలార్ ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న ప్రశాంత్ నీల్ రీసెంట్‌గా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నాడు. ఈ ఇంటర్వ్యూలో ఎన్టీఆర్ 31 ప్రాజెక్ట్ గురించి చర్చ రాగా.. నీల్ మాట్లాడుతూ.. సినిమా స్టోరీ లైన్? గురించి ఓ హింట్ ఇచ్చాడు. ఈ సినిమా నా ముందు సినిమాలకంటే భిన్నంగా ఉంటుంది. నేను సినిమా జానర్? గురించి మాట్లాడను. కానీ, ఫ్యాన్స్ అందరూ




ఇది యాక్షన్ ఫిల్మ్? అని అనుకుంటున్నారు. అయితే ఆడియన్స్?కు ఓ విషయం చెప్పాలనుకుంటున్నా. ఇది వరకు లాగా కాకుండా ఈ సినిమాను కొత్త జానర్? కథతో తెరకెక్కిస్తున్నా. ప్రేక్షకులకు దగ్గరయ్యే విధంగా కథ ఉంటుంది అని నీల్ చెప్పుకొచ్చారు. దీంతో సోషల్ మీడియాలో తారక్ ఫ్యాన్స్ సంబరాలు చేసుకుంటున్నారు.

## ఆపద సమయాల్లో చేయూతనందిద్దాం : విజయ్



మిగ్‌జాం తుపాను కారణంగా తమిళ నాడును వరదలు ముంచెత్తిన విషయం తెలిసిందే. భారీ వర్షాల ధాటికి వరదలు పోటెత్తడంతో చెన్నైతో పాటు కాంచీపురం, నాగపట్టనం, కడ్డలూరు, తిరువళ్లూర్‌ను వరదలు ముంచెత్తాయి. చెన్నైలోని చాలా ప్రాంతాల్లో ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలన్నీ నీట మునిగాయి. సహాయక సిబ్బంది ఎంత శ్రమిస్తున్నా రోడ్లు వరదతో జలమట్టమవుతున్నాయి. అలాగే రైలు, విమాన సర్వీసులు కూడా దెబ్బతిన్నాయి. ప్రస్తుతం తుపాను తీరానికి చేరుకోవడంతో భారీ వర్షాలు తగ్గుముఖం పట్టాయి. నగరంలో కొన్ని చోట్ల నిలిచిన వర్షపు నీరు ఇంకిపోతోంది. దీంతో చెన్నై నగరం క్రమంగా సాధారణ స్థితికి చేరుకుంటోంది. ఈ పరిస్థితిలో బాధితులకు సాయం చేసేందుకు రాజకీయ సినీ ప్రముఖులు ముందుకొస్తున్నారు. మరోవైపు కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ కూడా ఈ ఘటనపై సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. తన అభిమానులందరూ స్వచ్ఛందంగా వచ్చి బాధితులను ఆదుకోవాలని కోరారు. మిగ్‌జాం తుఫాను భారీ వర్షాల కారణంగా ఎంతో మంది పిల్లలు, మహిళలు, వృద్ధులు ఇబ్బందులకు గురవుతున్నారు. తాగునీరు, ఆహారం వంటి కనీస వసతులు లేక వేలాది మంది నానాఅవస్థలు పడుతున్నారు. వరదల్లో ఎంతోమంది చిక్కుకున్నారు. తమను రక్షించాలని కోరుతూ సోషల్ మీడియాలో ఇంకా వారి ఆర్తనాదాలు వినిపిస్తూనే ఉన్నాయి. ఈ సమయంలో, బాధిత ప్రాంతాల ప్రజలను ఆదుకోవడానికి ప్రభుత్వం చేపడుతున్న సహాయక చర్యల్లో నా అభిమానులంతా స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరుతున్నా అంటూ విజయ్ ట్విట్టర్ వేదికగా రాసుకోచ్చాడు.

# ట్రైలరే ఇలా ఉంటే.. మరీ సినిమా



**ప్రేక్షకులను భయపెట్టిస్తున్నా పిండం**

ప్రేక్షకులను భయపెట్టడమే లక్ష్యంగా తెలుగులో అసలుసిసలైన హారర్ చిత్రం రాబోతోంది. అదే 'పిండం'. 'ది స్కేరియస్ట్ ఫిల్మ్' అనేది ఉపశీర్షిక. శ్రీరామ్, ఖుషీ రవి జంటగా నటించిన ఈ సినిమాతో సాయికిరణ్ దైదా దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. కళాహి మీడియా బ్యానర్‌పై యశ్వంత్ దగ్గుమాటి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమా డిసెంబర్ 15వ తేదీన ప్రపంచవ్యాప్తంగా భారీగా విడుదలకు సిద్ధమవుతుండగా.. తాజాగా చిత్ర ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. 3 నిమిషాల 45 సెకన్లు ఉన్న ఈ ట్రైలర్ ఆద్యంతం మేకర్స్ చెప్పినట్లుగానే భయపెట్టేస్తోంది. ఈశ్వరీ రావుతో 'మరణం అనేది నిజంగానే అంతమా?. మరణించిన తరువాత ఏం జరుగుతుంది అనేది ఎవరైనా చెప్పగలరా?. కోరికలు తీరని వారి ఆత్మలు ఈ భూమ్మీద నిలిచిపోతాయా?. ఆ ఆత్మలు మనకు నిజంగానే హాని చేయగలవా?' అంటూ నిజ జీవితంలో కూడా ఎందరో తెలుసుకోవాలనుకునే ఆసక్తికర విషయాలను అవసరాల శ్రీనివాస్ అడగడంతో ట్రైలర్ ప్రారంభమైంది. చాలా కాలంగా ఎవరూ నివసించని ఒక ఇంటిలోకి హీరో శ్రీరామ్ కుటుంబం వస్తుంది. ఆ ఇంట్లో వారికి అనుకోని సంఘటనలు ఎదురవుతాయి. ఆత్మ ఆ కుటుంబానికి నిద్ర కూడా లేకుండా, ప్రాణ భయంతో వణికిపోయేలా చేస్తుంది. అలాంటి సమయంలో వారికి సాయం చేయడానికి వచ్చిన ఈశ్వరీ రావు 'మీ కుటుంబాన్ని వేధిస్తున్నది ఒక్క ఆత్మ కాదు' అని చెప్పడం మరింత ఉత్కంఠగా మారింది. అసలు అక్కడ ఏం జరుగుతుంది? ఆ ఆత్మల కథ ఏంటి? వాటి నుంచి శ్రీరామ్ కుటుంబాన్ని ఈశ్వరీ రావు రక్షించిందా? అనే ప్రశ్నలను రేకెత్తిస్తూ ట్రైలర్ నడిచింది.ఇక ప్రారంభంలో అవసరాల శ్రీనివాస్ అడిగిన ప్రశ్నలకు సమాధానం అన్నట్లుగా.. 'ఒక వస్తువుని తగలబెట్టినా, నరికినా, పూడ్చినా అది అంతమైపోతుందని మనం భ్రమపడతాం. కానీ ఆ వస్తువులోని అంతర్గత శక్తిని, ఆ ఎనర్జీని మనం ఎప్పటికీ నిర్మూలించలేం. ఇది శాశ్వత సత్యం' అని ఈశ్వరీ రావు చెప్పిన మాటతో ట్రైలర్‌ను ముగించిన తీరు ఆకట్టుకుంది. ట్రైలర్‌లో కెమెరా పనితనం, నేపథ్య సంగీతం కానీ హారర్ చిత్రానికి తగ్గట్టుగా ఉన్నాయి. మొత్తానికి ట్రైలర్ చూస్తుంటే థియేటర్‌లో ప్రేక్షకులు అసలైన హారర్ అనుభూతిని పొందడం ఖాయమనిపిస్తోంది. ఈ ట్రైలర్‌తో ఈ సినిమాపై అంచనాలు రెట్టింపవుతున్నాయి. ఇది యదార్థ సంఘటనల ఆధారంగా రాసుకున్న కథ అని, ఇంతటి భయానక హారర్ చిత్రాన్ని టాలీవుడ్ ఇంతవరకూ చూడలేదని చిత్ర బృందం చెబుతోంది. పిండం కథ ప్రస్తుతం అలాగే 1990 మరియు 1930 లలో.. ఇలా మూడు కాలక్రమాలలో జరుగుతుంది. స్క్రీన్‌ప్లే ఈ చిత్రానికి హైలైట్‌గా నిలవనుందని మేకర్స్ చెబుతున్నారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL 2021/81092, PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com